గరిష్ఠం 26.5
కనిష్ఠం 16.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.20 (301.3570)	16,735	16,735
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.10 (4.22)	1,377.71	1,377.71
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



జిన్నింగ్ మిల్లులు బంద్

- సీసీఐ నిబంధనలు సడలించాలని నిరవధిక సమ్మె
- జిల్లాలో పత్తి రైతులపై తీవ్ర ప్రభావం
- 7క్వింటాళ్లు, తేమశాతం నిబంధన సడలించాలంటున్న రైతులు

పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలకు నిరసనగా జిన్నింగ్ మిల్లులు నిరవధిక బంద్ చేపట్టాయి. దీంతో ఇప్పటికే నిండా మునిగిన పత్తి రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

తెలంగాణ కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం జిల్లాలోని 23 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు నిలిచాయి. సీసీఐ ఈఏడాది అమలులోకి తెచ్చిన నిబంధనలు రద్దుచేయాలని, కొన్ని మిల్లులే కాకుండా అన్ని మిల్లుల్లో కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలనే డిమాండ్‌తో జిన్నింగ్ మిల్లులు నిరవధిక బంద్‌లో పాల్గొంటున్నాయి. ఇప్పటికే తొలకరిలో వర్షాల్లేక పైరు ఎదుగుదల లోపించడం, తీరా పత్తి తీత దశలో అధిక వర్షాలతో తడవడం, తేమ ప్రభావం వంటి కారణాలతో నిండామునిగిన పత్తి రైతుకు తాజాగా, జిన్నింగ్ మిల్లుల బంద్‌తో మరింత ఇబ్బందికరంగా మారింది.

కొనుగోళ్లు తగ్గించడమే లక్ష్యంగా సీసీఐ నిబంధనలు!

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పలు నిబంధనలు అమలులోకి తెచ్చింది. పత్తి సాగుచేసిన రైతులు 'కపాస్ కిసాన్' యాప్‌లో నమోదు చేసుకుని, ఆ యాప్ ద్వారానే పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎకరాకు రూ.7క్వింటాళ్ల వరకు మాత్రమే ఒక్కో రైతు విక్రయించేందుకు సీసీఐ ఆమోదిస్తోంది. అదేవిధంగా తేమ 8 నుంచి 12శాతానికి లోబడి ఉంటేనే సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేస్తారు. అదే విధంగా అంతర్ జిల్లాలోనే పత్తిని విక్రయించాలని, జిల్లాలోని మిల్లుల్లో అన్నింటిలో ఏక సమయంలో పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తే బేళ్ల తయారీ, తరలింపు, సిబ్బంది కొరత వంటి కారణాలను చూపుతూ మిల్లులను మూడు కేటగిరీలుగా విభజించారు. ఎల్-1, ఎల్-2,ఎల్-3గా మిల్లులను విభజించి తొలుతఎల్-1 కేటగిరీ మిల్లుల్లో సామర్థ్యంమేరకు పత్తినికొనుగోలు చేశాకే ఎల్-2జాబిత మిల్లులు, ఆపై ఎల్-3 జాబితా మిల్లులకు పత్తిని కేటాయిస్తున్నారు. దీంతో పత్తి రైతులు విక్రయాల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని మిల్లులకు జిన్నింగ్ కొనసాగించే పరిస్థితి లేకుండా పోయింది. రైతుల నుంచి కొనుగోళ్లను తగ్గించాలనే లక్ష్యంతోనే సీసీఐ ఇలాంటి విధానం అమల్లోకి తెచ్చిందని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో అన్ని మిల్లులను సీసీఐ లీజుకు తీసుకుందని, సీజన్‌లో అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు నిర్వహించకుంటే మిల్లులు నష్టపోవాల్సి వస్తోందని చెబుతున్నారు. తలాతోకలేని సీసీఐ నిబంధనలను ఎత్తివేస్తే తప్ప జిన్నింగ్ ప్రారంభించేది లేదని మిల్లుల యాజమాన్యాలు తేల్చిచెప్పి సమ్మెకు దిగాయి.

రైతులకూ నిబంధనలు విధించిన సీసీఐ

రైతుల విషయంలోనూ పత్తి కొనుగోళ్లపై పలు ఆటంకాలు సృష్టిస్తోందని వారు వాపోతున్నారు. ఎకరాకు 7క్వింటాళ్ల నిబంధన సహేతుకం కాదని రైతులు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు బోరుబావుల కింద, కాల్వల కింద పత్తి సాగుచేశారు. అలాంటి చోట్ల ఎకరాకు 20 క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తోందని, అదేవిధంగా ఆరుతడిగా సాగుచేసిన చోట్ల కూడా పరిస్థితి అనుకూలించి సకాలంలలో వర్షాలు కురిస్తే ఎకరాకు కనీసం 15క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తాయని, బీటీ-2 సాగుపెరిగాక దిగుబడులు గణనీయంగా పెరిగిన విషయాన్ని సీసీఐ గుర్తించడం లేదని వాపోతున్నారు. వీటికి తోడు ఈ ఏడాది తేమ శాతం కూడా రైతులను ఇబ్బందికి గురిచేస్తోంది. సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12శాతం వరకు తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తారు. అంతకుమించితే పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు అగ్గువకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు...

- మిగతా 8వ పేజీలో...

తక్షణం నిబంధనలు సడలించాలని డిమాండ్

జిల్లాలో పత్తి మిల్లులు బంద్ ప్రకటించడంతో మరింత నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అధికవర్షాల నేపథ్యంలో దిగుబడులు తగ్గి నష్టపోతే, తాజాగా, తేమపేరుతో ధర ఎగ్గొడుతున్నారని, ఇప్పుడు మిల్లుల బంద్‌తో మరింత నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీసీఐతో చర్చించి 7క్వింటాళ్లు, తేమశాతం నిబంధనలతో పాటు అన్ని మిల్లులు నడిచేలా నిబంధనలు సడలించేందుకు ఒప్పించాలని రైతులు కోరుతున్నారు.

మిర్యాలగూడను ఉన్నతస్థానానికి తీసుకెళ్తాం

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రూ.238కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డితో కలిసి శంకుస్థాపన



మిర్యాలగూడలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రి కోమటిరెడ్డి, తదితరులు

మిర్యాలగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నియోజకవర్గాన్ని ఉన్నతస్థానానికి తీసుకవెళ్తామని నీటిపారుదలశాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలో రూ.171.5కోట్ల అభివృద్ధి పనులకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రారంభించిన ఐదు ఎత్తిపోతల పథకాలను ఏడాదిలో పూర్తిచేసి నూతన ఆయకట్టును సాగులోకి తెస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర ప్రకియగా అర్హులైన వారికి రేషన్‌కార్డులను జారీ చేస్తోందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు దృఢ సంకల్పంతో ముందుకుసాగుతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వినతి మేరకు సాగర్ ప్రధాన కాల్వ లైనింగ్‌కు రూ.57కోట్లు, నియోజకవర్గంలో దుబ్బతండ, శాంతినగర్, రావులపెంట చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.24కోట్లు, ఫీడర్ ఛానళ్ల నిర్మాణానికి సూమారు రూ.20కోట్లు మంజూరు చేస్తున్నట్టు హామీ ఇచ్చారు.

రూ.250కోట్లతో రోడ్ల నిర్మాణం : మంత్రి కోమటిరెడ్డి

నియోజకవర్గంలో రూ.250కోట్లతో హ్యామ్ రోడ్లు మంజూరు చేశామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి, డబుల్‌రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాగార్జునసాగర్‌కు రూ.450కోట్లు, దేవరకొండ

- మిగతా 8వ పేజీలో...

ప్రజలకు చేరువగా పోలీస్‌శాఖ

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 28 మంది ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. ఫిర్యాదుల సేకరణకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకవిభాగం పనిచేస్తోందన్నారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు.

తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల



తాటికల్ వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల

నకిరేకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పిల్లలు చివరి దశ వరకు జాగ్రత్తగా చూసుకోవాలని మండల న్యాయ సేవాధికారి, సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల అన్నారు. సోమవారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్ మండలం తాటికల్ వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులను పిల్లలు జాగ్రత్తగా చూసుకుంటే వృద్ధాశ్రమాలు తగ్గుతాయన్నారు. జూనియర్ సివిల్ జడ్జి షేక్ హనీఫ్ మాట్లాడుతూ, పిల్లలకు విలువ తెలిసినప్పుడే తల్లిదండ్రులను సరిగా చూసుకుంటారని, అందుకే ఆస్తులను వారి పేర రాయవద్దని సూచించారు. అనంతరం వృద్ధులకు జడ్జి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల, దివ్యాంగుల, స్త్రీశిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ప్యానల్ అడ్వకేట్లు డి.సోమయ్య, సీహెచ్.నాగరాజు, పీఎల్ వి.వెంకటేశ్వర్లు, వృద్ధాశ్రమ ట్రస్ట్ చైర్మన్ ఎన్.రామ్మోహన్‌రావు, యాదగిరిరెడ్డి, వై.మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా అన్నెబోయిన మట్టయ్య



అన్నెబోయిన మట్టయ్య

నల్లగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ (డీసీసీసీ) నూతన జిల్లా అధ్యక్షుడిగా అన్నెబోయిన మట్టయ్య ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని డీసీఐసీ కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కట్టమనోహర్, ఉపాధ్యక్షుడిగా ఎండీ అస్మా, ఎండీ.ముస్తాఫా, ఎండీ.నజీర్‌పాషా, సహాయ కార్యదర్శులుగా తిరందాసు ఆంజనేయులు, పసునూరి రాంబాబు, ప్రచార కార్యదర్శిగా దువ్వా గీత, కోశాధికారిగా కొప్పోలు విమలమ్మ, డివిజన్ కార్యదర్శులుగా పొలగాని వెంకటేశ్వర్లు, సీహెచ్.సాంబశివరావు, రాపోలు శివకుమార్, గండూరి నరసింహ, కార్యవర్గ సభ్యులుగా జూలూరు వెంకటేశం, ఏమిరెడ్డి రవీందర్‌రెడ్డి, బత్తిని లక్ష్మయ్య, పొట్టబత్తిని సత్యం, కౌసల్య ఎన్నికయ్యారు. జిల్లా పౌరసరఫరాలశాఖ ఏఎస్‌వో రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలను డీసీఐసీ కన్వీనర్ చింతమళ్ల గురవయ్య, కట్టెకోల నరసింహారావు, సీఏటీసీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు నిర్వహించారు. జిల్లాలో వినియోగదారుల హక్కుల పరిరక్షణతో పాటు, వినియోగదారుల రక్షణ చట్టం అమలుకు తమవంతుగా కృషి చేస్తామని, వినియోగదారుల్లో చైతన్యాన్ని తీసుకువచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రకటించింది.

'ప్రజావాణి' ఫిర్యాదులు పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 17,(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించారు. వర్షం కారణంగా గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. డెంగీ లాంటి వ్యాధులు రాకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా పూర్తిగా శానిటేషన్ చేయాలన్నారు. ఈ కార్యమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 129 ఫిర్యాదులు వచ్చాయి.

ఆడబిడ్డల సంరక్షణ అందరి బాధ్యత

నల్లగొండ రూరల్: ఆడబిడ్డల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సేవ్ ద చైల్డ్ జిల్లాస్థాయి కార్యచరణ ప్రణాళికపై కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, బాల్య దశలోనే గర్భం దాల్చడం వంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఆడబిడ్డను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (వీసీపీసీ)లో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పాలన అధికారులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఏర్పాటు చేయాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పకడ్బందీ తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తే వెంటనే సమాచారం తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పెద్దవూర, తిరుమలగిరి సాగర్, దామరచర్ల, పీఏపల్లి వంటి మండలాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో బాల్య వివాహాలు, ఆడపిల్లల అక్రమదత్తత, బాల్య వివాహాలపై దోస్తు బాక్సులు ఏర్పాటు చేయాలని అదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్యవివాహాలు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం, తదిత అంశాలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

బాలికల హాస్టళ్లు, పాఠశాలలతో పాటు, బాలుర హాస్టల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, చారుమతి ఎన్జీవో అధ్యక్షుడు నాగసేనారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఈవో బిక్షపతి, నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి ఉన్నారు.

ఈపీఎస్ పింఛన్‌దారులను ఆదుకోవాలి



ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, వివిధ ప్రైవేట్ సంస్థల్లో పనిచేసి రిటైర్ ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించి, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం టాప్రా ఆధ్వర్యంలో జిల్లా ప్రావిడెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం చెల్లించాలని, తక్షణమే హయ్యర్ పెన్షన్‌ను వివక్ష లేకుండా అందరికీ వర్తింపజేసి, ఈపీఎఫ్ ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈపీఎస్-95 పెన్షన్ స్కీమ్ పేరుతో అమలవుతున్న పెన్షన్ నెలకు రూ.వెయ్యి అంతకులోపే వస్తోందన్నారు. అందుకే కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని 7వ వేతన సవరణ సంఘం సిఫార్సు చేసిందని కానీ ప్రభుత్వం ఆ స్థోమత లేదని చెబుతూ కార్పొరేట్లకు అనేక రాయితీలతో షేక్ హ్యాండ్ ఇస్తూ ఈపీఎస్ పెన్షనర్లకు మొండి చేయి చూపిస్తుందన్నారు. దేశం ఆర్థికంగా పెరిగినా పెన్షన్ పెరగడం లేదని, నిత్యం ధరలు పెరుగుతున్నా పెన్షన్‌కు రక్షణ లేదని కనీస అవసరాలు తీర్చని పెన్షన్ ను ప్రవేశపెట్టడమే మోసపూరితమని అందుకే ఈపీఎస్ పెన్షనర్లు పెన్షన్ విద్రోహ దినం పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎండీ. అబ్దుల్ ఖాదర్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బానాల పరిపూర్ణాచారి, గుండాల బీక్షమయ్య, రాపోలు వెంకటేశం, కొమ్మారెడ్డి రాయపురెడ్డి, పట్టేటి కృష్ణయ్య, మౌలానా ఆస్కార్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని కట్టడి చేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



డిండిలో ప్రచారజాతలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

డిండి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మతోన్మాద బీజేపీని దేశంలోని వామపక్ష లౌకికశక్తులు కట్టడిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ప్రచారజాతాకు సోమవారం డిండి మండల కేంద్రంలో ఆయన స్వాగతం పలికారు. రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ స్వతంత్ర సంస్థలను ఉపయోగించుకొని అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థ బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నతోందన్నారు. నేరచరిత్ర ఉన్నవారు చట్టసభలకు ఎన్నికవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని నియంత్రించడానికి ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని ఖమ్మం బహిరంగ సభ ద్వారా సంకేతాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతలులేని నూతన సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతోందని తెలిపారు. ఈనెల 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నర్సింహ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైందని తెలిపారు. దేశ భక్తులమని చెప్పుకునే బీజేపీ ఏం త్యాగాలు చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాలనర్సింహ, పల్లా నర్సింహారెడ్డి, పయాజ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, బి.వెంకటరమణ, టి.బుచ్చిరెడ్డి, ఎండి.మైనుద్దీన్, ఎస్ఆర్.కనకచారి, శైలేష్, విజేయేందర్‌రెడ్డి, ఎనమళ్ల నవీన్, నూనె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు పెంచాలి



రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పత్తికి మద్దతు ధర ఇచ్చి, సీసీఐ కొనుగోలు కేంద్రాలను పెంచాలని రైతు సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కల్లేపల్లి గ్రామంలో పత్తి పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. వరి పంట తర్వాత రైతులు పత్తి రంటను అధికంగా సాగు చేస్తారని, పెట్టుబడి ఎకరాకు సుమారు రూ.50వేల వరకు ఖర్చు చేస్తారన్నారు. విత్తనాలు దొరకక, యూరియా అందుబాటులో ఉండక, నకిలీ పురుగుమందులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు రవినాయక్, మాలోతు వినోద్‌నాయక్, లావుడియా ఎర్రనాయక్, దయాకంద్ సుభాని, విజయ్, వెంకటయ్య, ప్రసాద్, లక్ష్మయ్య, హచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ క్యాంపస్‌లో 19న జాబ్ మేళా

నల్లగొండ కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 19వ తేదీన ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎన్. పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, గ్రాడ్యుయేట్, ఫార్మసీ చదివిన విద్యార్థులు హాజరుకావాలని కోరారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి నల్లగొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంజీయూలో విద్యార్థుల నిరసన

నల్లగొండ, నవంబరు 17,(ఆంధ్రజ్యోతి): లైబ్రరీలో పుస్తకాల అనుమతిపై మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. లైబ్రరరీలో విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు అనుమతించాలని కోరుతూ ఏబీవీపీ, బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీఎస్‌యూ, ఎస్సీ, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో లైబ్రరరీ ఎదుట నిరసన తెలిపారు. దీంతో యూనివర్సిటీ అధికారులు విద్యార్థి సంఘాలతో చర్చించారు. విద్యార్థుల డిమాండ్లను అంగీకరించిన యూనివర్సిటీ అధికారులు లైబ్రరరీలోకి పుస్తకాలపై విధించిన సర్క్యూలర్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



ఏజెన్సీల మధ్య ఆధిపత్య పోరు

● మోడల్ స్కూల్ ఉద్యోగులకు వేతనాల వేతలు ● 8 నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు ● ఏజెన్సీల మధ్య రగడతో నిలిచి వేతనాలు

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లాలో రెండు ప్రధాన పార్టీలకు చెందిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకుల ఆధిపత్య పోరు మోడల్‌స్కూల్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు శాపంగా మారింది. ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మఠంపల్లి, మునగాల, నడిగూడెం, తిరుమలగిరి, అనంతారం, ఇమాంపేట, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), గడ్డిపల్లిలలో మోడల్ స్కూల్స్ ఉన్నాయి. 2013లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఫిజికల్ డైరెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్, అంటెడర్, నైట్‌వాచ్‌మన్‌లుగా నలుగురు చొప్పున నియమితులై విధులను నిర్వహిస్తున్నారు. వీరందరికీ సకాలంలో వేతనాలు అందడం లేదు. ఈ విద్యా సంవత్సర ప్రారంభంలో ఏజెన్సీల మధ్య వివాదాలతో వేతనాలు నిలిచిపోయాయి. రాజకీయ ప్రాబల్యం కలిగిన ఏజెన్సీల మధ్య టెండర్ల విషయంలో ఆధిపత్య పోరు తమ వేతనాల పంపిణీపై పడినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా దీపావళి సందర్భంగా జిల్లా ఉన్నతాధికారుల ప్రత్యేక ఫండ్ నుంచి రెండు నెలల వేతనాలు అందించారు. ఇంతలో కొత్త ఏజెన్సీకి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బాధ్యతలు అప్పగించారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా అవుట్ సోర్సింగ్ బాధ్య తలు అప్పగించారని పాత ఏజెన్సీ వారు కోర్టుకు వెళ్లారు. ఏజెన్సీల నిర్వహణ కోర్టు వివాదంలో ఉండటంతో ఎనిమిది నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి వేతనాలు మంజూరు చేయాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు.

వేతనాలు మంజూరు చేయాలి



జిల్లాలోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వేతనాలు అందకపోవడంతో రోజు వారి జీవనం కష్టతరంగా మారింది. ఏజెన్సీల మధ్య నెలకొన్న సమస్యలతో తమ జీవితాలు ఇబ్బందికరంగా మారాయి. ప్రభుత్వ పెద్దలు సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలి.

సామరాజు, ఫిజికల్ డైరెక్టర్ మోడల్ స్కూల్, మఠంపల్లి

కూరగాయల వ్యాపారుల

కష్టాలు తీరేనా!

● ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు

● రూ.80 లక్షలతో మార్పులు, చేర్పులకు ప్రతిపాదనలు



లాంతర్ల వెలుగులో కొనసాగిస్తున్న కూరగాయల వ్యాపారాలు

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

సూర్యాపేట జిల్లాలో రహదారిపై కూరగాయల వ్యాపారం నిర్వహించే వ్యాపారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎండనకు, వానకు ఇబ్బంది పడుతూనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో మహిళా వ్యాపారుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. రాత్రి వేళ ప్రైవేట్‌లో అద్దెకు తీసుకున్న లాంతర్ల వెలుగులో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో లాంతర్‌కు రోజుకు రూ.30 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. వీరి కోసం రూ.కోట్లు ఖర్చు చేసి నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగం, పంచాయతీరాజ్, మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగాలు పలు దఫాలు పరిశీలన చేశాయి. ప్రస్తుతం ఉన్న స్టాల్స్ సైతం సరిపోవని, వాటిని సైతం విస్తరించాలని అధికారులు సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు విక్రయించే వారు సుమారు 240 మంది ఉన్నట్లుగా వ్యవసాయ మార్కెట్ అధికారులు చెబుతున్నారు. వీరితో పాటు హోల్‌సేల్ వ్యాపారులు సుమారు 25 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంటిగ్రేటెడ్ భవనంలోకి గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు తీసి వేసి ఐరన్ గ్రిల్స్, తెరచాటు జాలీలు, పైభాగంలో ఉన్న ప్లాస్టిక్ షీట్స్‌ను తీసివేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మార్పుల కోసం రూ.80 లక్షలకు పైచిలుకు ఖర్చు వచ్చే అవకాశం ఉందని బడ్జెట్ కేటాయించాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. బడ్జెట్ మంజూరు కాగానే త్వరలోనే పనులు చేపట్టడానికి మరో మారు ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలన చేయనున్నట్లు వ్యవసాయ మార్కెట్ అధికారులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ వరకు మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులు ఒకేచోట నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

బడ్జెట్ కేటాయించాలని మంత్రులకు విన్నవించాం



సూర్యాపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. బడ్జెట్ కేటాయించాలని మంత్రులకు విన్నవించాం. రూ.కోట్లు ఖర్చు చేసినా మార్కెట్ నిరుపయోగంగా ఉంది. గాలి, వెలుతురు ప్రసరించేలా పనులు చేయించాల్సి ఉంది. త్వరలోనే పనులను చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తాం.

కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

డ్రోన్ విమానం, నిర్వాహకుల పట్టివేత



పాలెంలో స్థానికులు పట్టుకున్న డ్రోన్ విమానం

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో నాలుగు రోజులుగా అనుమానాస్పదంగా చక్కర్లు కొడుతున్న డ్రోన్ విమానాన్ని, నిర్వాహకులను గ్రామస్థులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రఘునాథపాలెం గ్రామశివారులో నాలుగు రోజులుగా డ్రోన్ విమానం చక్కర్లు కొడుతోంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఈ డ్రోన్ విమానాన్ని వ్యవసాయ పొలాలు. పాలెం గ్రామం మీదిగా తిప్పుతున్నారు. దీంతో రైతులు, పాలెం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏపీ 39ఎస్ఎన్ 0813 వాహనంలో వస్తూ పాలెం పరిధిలోని వ్యవసాయ పొలాల వద్ద వాహనాన్ని నిలిపి సమీపంలోని ఒక వేపచెట్టు వద్ద ముగ్గురు వ్యక్తులు రిమోట్ కంట్రోల్ ద్వారా ఈ డ్రోన్ విమానం నడిపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రోన్ విమానం తిప్పుతుండటంతో రైతులు, గ్రామస్థులు భయాందోళన చెందారు. రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తున్న ప్రాంతాన్ని, నిర్వాహకులను గుర్తించి వాహనాన్ని, డ్రోన్ విమానాన్ని పట్టుకున్నారు. అయితే తాము డ్రోన్‌ను పరీక్షిస్తున్నా మని, ఎంత సేపు తిరుగుతుం దని తెలుసుకుంటున్నామని, అంతేగని ఏదీ సర్వే చేయడం లేదని చెప్పడంతో వదిలేశారు. ముగ్గురులో ఒకరు మండలానికి చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన వారని రఘునాథపాలెం మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

నకిరేకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీతకా ర్మికుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెం దిన నర్సింగ్ యాదయ్య ఆదివారం సాయ ంత్రం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకుతో పాటు జారి పడటంతో ఆయన తీవ్రగాయాలయ్యాయి. ప్రథ మచికిత్స కోసం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పరిస్థితి విషమించడంతో నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని నోముల గౌడ సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్యగౌడ్ కోరారు.

వీధి వ్యాపారులకు తీపికబురు!

● స్వనిధి రుణసహాయాన్ని రూ.15వేలకు పెంచిన కేంద్ర ప్రభుత్వం



(ఆంధ్రజ్యోతి-రామగిరి)

వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వారికి మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకం రుణసహాయాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎనిమిది నెలలుగా ఈ పథకం వెబ్‌సైట్ పనిచేయలేదు. దీంతో వీధి వ్యాపారులంతా ఇక ఆ పథకం రద్దయ్యినట్లేనని భావించారు. తిరిగి ఈ పథకాన్ని 20 రోజుల క్రితం పునఃప్రారంభిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. 2030 వరకు ప్రస్తుతం ఇచ్చిన మార్గదర్శకాలు కొనసాగుతాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. గతంలో రూ.10,000 ఇచ్చిన పథకాన్ని తాజా మార్గదర్శకాల ప్రకారం దానిని రూ.15,000 పెంచుతూ నిర్ణయం తీసుకొంది. 2వ విడత ఇచ్చే రూ.20 వేల రుణ పథకాన్ని రూ.25,000కు పెంచింది. ఈ మేరకు బ్యాంకర్లకు కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక వీధి వ్యాపారి మొదట రూ.15,000 రుణం తీసుకొని నెల నెలా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఆ రుణం తీరిన తర్వాత 2వ విడతగా రూ.25,000 ఇస్తారు. ఇది కూడా బ్యాంకుల్లో నెలవారీగా చెల్లించిన తర్వాత మూడవసారి రుణం రూ.50,000 ఇస్తారు. ఇక రూ.50వేలు తీసుకొని రుణాన్ని చెల్లించిన వారి వ్యాపార లావాదేవీలను అనుసరించి రూ.30 నుంచి రూ.50 వేల పరిమితి గల క్రెడిట్ కార్డు కూడా అందజేయనున్నారు. అంతేకాకుండా ఒక నెలలో 200 వరకు ఆన్‌లైన్ ద్వారా వ్యాపార లావాదేవిలు జరిగితే రూ.100 క్యాష్‌బ్యాక్ వచ్చే సౌకర్యం కల్పించింది. ఇదిలా ఉండగా గతంలో 300రకాల వ్యాపారులకే రుణసౌకర్యం అందేలా ఉండగా కొత్తగా వచ్చిన మార్గదర్శకాల ప్రకారం వాటిని 575 రకాల వ్యాపారులకు రుణాలు ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అర్హులేనని అధికారులు గుర్తిస్తే వీరికి మొదటి విడతలోనే రూ.15వేల సహాయం అందనుంది.

మునిసిపాలిటీల వారీగా లక్ష్యం

పీఎం స్వనిధి ద్వారా బ్యాంకర్లతో మాట్లాడి అర్హులైన పేదలకు రుణాలు ఇప్పించాలని కేంద్రం మునిసిపాలిటీల వారీగా లక్ష్యాన్ని విధించింది. దీంతో నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మునిసిపాలిటీల్లోని మెప్మా సిబ్బంది దృష్టి సారించారు. 2020లో చిరు వ్యాపారం చేసుకుంటున్న 19,756 గుర్తించారు. ఇందులో 17వేల మందికి మొదటి విడతగా రూ.10వేల చొప్పున, రెండో విడతలో 12,770 మందికి రూ.20వేల చొప్పున, మూడోవ విడతలో 9,476 మందికి రూ.50వేల చొప్పున రుణాలు ఇప్పించారు. ఇక వీరితో పాటు మరో 676 మందిని విధివ్యాపారులకు రుణాలు ఇప్పించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మునిసిపల్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో గత ఆగస్టు నుంచి నేటి వరకు 375 మందిని గుర్తించారు. వీరి దరఖాస్తులను పరిశీలన చేసి బ్యాంకర్లకు పంపించారు. ఇందులో 125 మందికి రుణాలు మంజూరయ్యాయి. మిగిలిన వారికి కూడా త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వివిధ కేటగిరీలకు చెందిన రుణాలు కూడా చెల్లించారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకొవచ్చు



వీధి వ్యాపారులు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో నామమాత్రపు వడ్డీతో బ్యాంకు నుంచి రుణాలు అందజేయనున్నారు. మునిసిపల్ పరిధిలో వీధి వ్యాపారం చేస్తున్నట్లుగా గుర్తింపు కార్డు కలిగి ఉండి, 18 ఏళ్లకు పైబడి ఉన్నవారు, 2020 నుంచి నేటి వరకు వ్యాపారంలో కొనసాగేవారు అర్హులు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

శివాజీనాయక్, నల్లగొండ జిల్లా కో-ఆర్డినేటర్, మెప్మా

మొబైల్‌లోనే దరఖాస్తుకు అవకాశం

ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లోని గూగుల్ ద్వారా పీఎం స్వనిధి అనే సైట్‌ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. సైట్‌లో (కే.వై.సీ) అడిగే వివరాలను పొందుపరిస్తే ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత మునిసిపల్ కమిషనర్ లాగిన్‌కు వెళ్తోంది. దీంతో మునిసిపల్ కార్యాలయం నుంచి సంబంధిత దరఖాస్తుదారుడికి ఫోన్ ద్వారా దరఖాస్తు విషయం తెలియజేయడంతో పాటు అర్హులను గుర్తిస్తారు. అర్హుల జాబితా దరఖాస్తులను బ్యాంకర్‌లకు పంపిస్తారు. దీంతో బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తారు.

నామమాత్రపు వడ్డీకే రుణం

వీధి వ్యాపారం చేసుకొని స్వయం ఉపాధి పొందే చిరు వ్యాపారులకు నామమాత్రపు వడ్డీకే అంటే 12శాతానికి రుణాలు అందజేస్తారు. మొదటి విడతలో తీసుకునే రూ.15వేల సహాయాన్ని 14 నెలలో, ఇక రూ.25వేలు తీసుకునే వారు 18 నెలలో, రూ.50 వేలు తీసుకునేవారు 24 నెలలో కిస్తుల వారీగా చెల్లించాల్సి ఉంటోంది. కిస్తుల చెల్లింపులో తాత్సారం లేకుండా చెల్లించిన వారికి మాత్రమే ఏడు శాతం వడ్డీ రాయితీని సదరు దరఖాస్తుదారుని ఎకౌంట్‌లో జమచేస్తారు. బ్యాంకుల్లో ఎలాంటి డాక్యుమెంటేషన్ పరిశీలన లేకుండా ఇచ్చే రుణం ఎంతో మంది వీధి వ్యాపారులకు ప్రయోజనకరంగా మారనుంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి



నరేష్(ఫైల్)

కేతేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు అతివేగంగా ఢీకొట్టడంతో కాలినడకన రోడ్డు దాటుతున్న యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్-విజయవాడ(65) జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో సోమవారం జరిగింది. ఎస్ఐ సతీష్, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొర్లపహాడ్ గ్రామానికి చెందిన అనుముల నరేష్(37) స్థానికంగా మటన్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కాలినడకన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని దాటుతున్నాడు. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది చికిత్స కోసం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి వెళ్లే సమయానికే నరేష్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నరేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నరేష్‌కు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్

సంస్థాన్ నారాయణపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సంస్థాన్‌నారాయణపురం మండలం వెంకంబావితండాకు చెందిన కొర్ర హనుమంతు(28) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తండా నుంచి మండలకేంద్రానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మిల్లు సమీపంలో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు హనుమంతు అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ

నకిరేకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. సీఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఉన్నాయి. తాటికల్‌కు చెందిన బండమీది వెంకటమ్మ(50)ఆదివారం సాయంత్రం కిరాణం దుకాణం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో నల్లగొండ నుంచి తాటికల్ మీదుగా వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో అదే రాత్రి మృతి చెందింది. ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటమ్మ భర్త యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నలు సీఐ వెంకటేష్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

దేవరకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన నేనావత్ దేవి(50) రోడ్డు దాటుతుండగా ఆదివారం రాత్రి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహనంలో మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా వాహనాన్ని పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

చింతలపాలెం / మేళ్లచెర్వు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న ఘటనలో ట్యాంకర్ లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. సిమెంట్ లోడుతో టీఎస్29టి5657 నెంబరు గల ట్యాంకర్ లారీ వెళ్తోంది. బ్రిడ్జి సమీపంలో ఇరుకుగా ఉండటంతో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనక ఉన్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ అజయ్‌దాస్‌కి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి రైతుకు గాయాలు

ఆత్మకూరు(ఎం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాట పంచాయితీ విషయంలో పొలం దున్నుతుండగా ట్రాక్టర్‌ను ఆపబోయిన రైతు ఎగిరి పొలంలో పడి గాయాలయ్యాయి. సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో సోమవారం జరిగింది. పుల్లాయిగూడెం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు జింకల మల్లయ్య ట్రాక్టర్‌తో తన పొలం దున్నుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మాలి లింగారెడ్డి పొలం ఎలా దున్నుతావు అంటూ మల్లయ్యను అడ్డుకోబోయాడు. మల్లయ్య పొలం దున్నుతుండగానే లింగారెడ్డి ట్రాక్టర్‌పైకి ఎక్కాడు, ఈ క్రమంలో ట్రాక్టర్ ఎక్స్‌లేటర్ పై కాలు పడింది. దీంతో ట్రాక్టర్ వేగంగా చుట్టూ తిరగ్గా లింగారెడ్డి ఎగిరి బురదపొలంలో పడి గాయపడ్డాడు. గమనించిన చుట్టుప్రక్కల రైతులు అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. జింకల మల్లయ్యకు, మాలి లింగారెడ్డి అతడి సోదరులతో పొలం బాట పంచాయితీ ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

పొలంలో మోటారు చోరీ

నార్కట్‌పల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో వ్యవసాయ బావి వద్ద మోటారు చోరీకి గురైంది. చిన్నతుమ్మల గూడెం గ్రామానికి చెందిన వస్కుల శంకర్ తన మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేయడానికి ఓపెన్ వెల్ వద్ద ఏడు హెచ్‌పీ సామర్థ్యం గల మోటారును బిగించారు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా వైర్లను తెంచి మోటారును దొంగిలించినట్లు గుర్తించాడు. మోటారు చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

బెదిరింపులపై ఫిర్యాదు

నూతనకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాట్సాప్ కాల్ ద్వారా బెదిరింపులకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తుంగతుర్తి నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మందుల సామేలు అనుచరుడు పాల్వాయి నాగరాజు తెలిపారు. నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి పండు అనే వ్యక్తి వాట్సాప్ ఫోన్ కాల్ చేసి చంపుతానని బెదిరిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మెసేజ్‌ల ద్వారా మానసికంగా వేధిస్తున్నట్లు ఆయన తెలిపారు. అతడి నుంచి తనకు ప్రాణభయం ఉందని, చర్యలు తీసుకోవాలని కోరారు.

టైర్ పేలి ఎక్సైజ్ ఎస్ఐ కారు బోల్తా

● భార్యభర్తలతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జయిన కారు, గాయపడిన ఎస్ఐ భానుప్రకాష్

కట్టంగూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టైర్ పేలి కారు బోల్తాకొట్టింది. ఈ ఘటనలో నకిరేకల్ ఎక్సైజ్ ఎస్ఐ దంపతులతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామశివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకిరేకల్ ఎక్సైజ్ ఎస్ఐ భానుప్రకాశ్ తనభార్య ప్రియాంక, కుమార్తెతో కలిసి హైదరాబాద్ నుంచి నకిరేకల్ వైపు కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో శ్రీకృష్ణనగర్ వద్దకు రాగానే కారు టైరు పేలింది. దీంతో అదుపుతప్పి ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డు ప్రక్కన నీటి గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న నకిరేకల్ ఎక్సైజ్ ఎస్ఐ భానుప్రకాశ్ అతని భార్య ప్రియాంకతో పాటు ద్విచక్రవాహనంపై వెళ్తున్న నకిరేకల్ మండలం చందపంల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు పాలడుగు అంజయ్య, రేణుకలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నల్లగొండ, హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానమై పెనుభూతమై
భార్య హతం



పద్మ(ఫైల్)

మోతె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హత్యచేసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరికొండ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కారింగుల వెంకన్నగౌడ్‌కు 25ఏళ్ల క్రితం తుమ్మలపెన్‌పహడ్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఆమెకు సంతానం కలగనందున ఐదేళ్ల తర్వాత ఆమెకు విడాకులు ఇచ్చాడు. అనంతరం నడిగూడెం మండలం ఎక్లాస్‌కాన్‌పేటకు చెందిన పద్మ(46)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు మూడేళ్లక్రితం వివాహం చేయగా, కుమారుడు హైదరాబాద్‌లో ఉన్నతవిద్య చదువుతున్నాడు. వెంకన్నగౌడ్, పద్మ దంపతులు కల్లు గీత వృత్తి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు. సీజన్ ముగియగానే గ్రామానికి వచ్చి తమకున్న నాలుగు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. భార్య ప్రవర్తన సరిగా లేదని వెంకన్నగౌడ్‌కు కొన్నేళ్లుగా అనుమానిస్తుండగా, ఈ విషయమై ఇద్దరూ ఘర్షణ పడుతున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో రోకలితో భార్య తలపై మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. వెంకన్నగౌడ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పద్మ మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సిరిపురం సమస్యాత్మక గ్రామం అయినందున గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 20మంది పోలీసులు సిరిపురం గ్రామంలో గస్తీ కాస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు వెంకన్నగౌడ్‌పై హత్య కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

పుట్టపాకలో ముంబై టెక్స్‌టైల్స్ విద్యార్థుల పర్యటన



పుట్టపాకను సందర్శించిన ముంబాయి సస్మిరా ఇన్స్టిట్యూట్ విద్యార్థులు

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముంబైలోని సస్మిరా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అండ్ టెక్స్‌టైల్స్ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు మండలంలోని పుట్టపాక గ్రామంలో సోమవారం పర్యటించింది. డబుల్ ఇక్కత్, తేలియారుమాల్ తయారు విధానాన్ని చేనేత కళాకారులు గోలి సాంబయ్య, గూడ శ్రీనును అడిగి తెలుసుకున్నారు. మగ్గంపై వస్త్ర తయారీ, చేనేత కళాత్మక పనితీరు, రంగుల అద్దకం వంటి పనులను పరిశీలించి, కార్మికుల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు.

లలిత సిమెంట్స్‌కు రూ.80 వేలు జరిమానా

మఠంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న లలితా సిమెంట్ పరిశ్రమకు విజిలెన్స్ అధికారులు జరిమానా విధించారు. సోమవారం విద్యుత్ విజిలెన్స్ డీఈ స్వామినాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లలిత సిమెంట్స్‌లోని గెస్ట్‌హౌస్‌కు సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి అక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగించుకుంటున్న లలిత సిమెంట్స్ వారిని హెచ్చరించి రూ.89 వేలు జరిమానా విధించామన్నారు. నిబంధనల ప్రకారం విద్యుత్ ఉపయోగించాలని, చోరీకి పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవని డీఈ హెచ్చరించారు.

19న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని మేఖల అభినవ్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ దగ్గుపాటి విమల ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2012 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డులతో ఉదయం 9గంటలకు స్టేడియానికి హాజరుకావాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

నెరవేరని పెండ్లిపాకల



పెండ్లిపాకల రిజర్వాయర్ కట్ట తెగిపోవడంతో వృథాగా వెళ్తున్న నీరు

» ముందుకుసాగని ప్రాజెక్టు ఎత్తు పెంపు పనులు
» ప్రభుత్వం మారినా కన్పించని పురోగతి

నల్లగొండ జిల్లాలో దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండలంలోని పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తుపెంపు పనులు ముందుకు సాగడం లేదు. దశాబ్ద కాలంగా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. గ్రావిటీ ద్వారా రైతులకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన పనులు మొదట్లో మందకొడిగా సాగినా తర్వాత ఊసే లేకుండాపోయాయి.

- ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి

కొండమల్లేపల్లి మండలంలోని 0.5టీఎంసీల సామర్థ్యమున్న పెండ్లిపాకల జలాశయాన్ని 2.2 టీఎంసీలకు పెంచాలనే ఉద్దేశంతో 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి సుమారు రూ.450కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. డిండి జలాశయం ద్వారా నీటిని నింపాలనే ఆలోచనతో ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం 2,771ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,917ఎకరాలు మాత్రమే సేకరించారు. ఇంకా 854 ఎకరాలు సేకరించాల్సి ఉంది. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ రూ.343కోట్లకు టెండర్ దక్కించుకున్నాడు. జలాశయం ఎత్తు పెరిగితే మండలంలో ని కారోబార్ తండా, పత్యతండా, హర్యతండా, గుడితండా పూర్తిగా ముంపునకు గురవుతాయి. ప్రాజెక్టు ఎత్తుపెంపుతో సుమారు 1,300 నుంచి 1,400 కుటుంబాలు భూ నిర్వాసితులవుతాయి. ముంపు గ్రామమైన గుడితండాలో ప్రజలతో ఎస్‌డీసీ(స్పెషల్ డిప్యూటి కలెక్టర్ భూ సేకరణ) ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాలు సేకరించారు. సామర్థ్యం పెరిగితే పెండ్లిపాకల గ్రామపంచాయతీ పరిధిలో సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. పేర్వాల వద్ద కాల్వ నిర్మిస్తే నేరేడుగొమ్ము మండలంలో సుమారు తొమ్మిది వేల ఎకరాలు సాగులోకి వస్తుందని అధికారులు లెక్కలు వేశారు. 2018లోనే పూర్తి కావాల్సిన పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అలాగే ఉన్నాయి. కేవలం 31శాతం పనులు మాత్రమే చేపట్టి పనులు నిలిపివేశారు. మిగిలిన పనులు పూర్తిచేయాలంటే ప్రస్తుతం రేట్లతో సుమారు రూ.600కోట్ల నుంచి రూ.650 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు తెలుపుతున్నారు.

నాయకులు హామీలు నీటి మూటలే

పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తామని గత ప్రభుత్వం చేసిన ప్రకటనలు హామీలకే పరిమితమయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు ఎత్తుపెంచి పూర్తి చేస్తామని గత ఎన్నికల సమయంలో కొండమల్లేపల్లిలో నిర్వహించిన సభలో అప్పటి ఓ మంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం మారి రెండు సంవత్సరాలు కావొస్తున్నా అధికార పార్టీ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం పనులు ప్రారంభం కాలేదు.

పదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు



పెండ్లిపాకల జలాశయం ఎత్తు పెంపునకు పదేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ సగం పనులు కూడా పూర్తి కాలేదు. రిజర్వాయర్ ఎత్తు పెంపుతో మూడు కాలాలకు సరిపడ పంటలు పండుతాయని ఆశపడ్డాం. పనులు పూర్తి కాకపోవడంతో ఆశలు ఆవిరయ్యాయి. ప్రభుత్వం త్వరగా జలాశయం ఎత్తు పనులు పూర్తిచేయాలి.

- నక్క సైదులు పెండ్లిపాకల

కాంట్రాక్టర్‌తోనే పనుల్లో ఆలస్యం

టెండర్ దక్కించుకున్న గుత్తేదారు సకాలంలో పనులు పూర్తి చేయకుండా జాప్యం చేశారు. దీంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం. ఎలాంటి స్పందన రాలేదు. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన టెండర్ రద్దు చేసి మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ప్రస్తుత ధరల ప్రకారం అడ్మినిస్ట్రేట్ నుంచి అనుమతి తీసుకొని ప్రతిపాదనలు పంపి త్వరలోనే కొత్త టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకుంటాం.

- కేతావత్ నెహ్రూ, జలాశయం ఈఈ.

మాకు ఆవాసం కల్పించండి

● 12 సంవత్సరాలు గడుస్తున్నా భరోసా లేని బతుకులు



చర్లగూడ రిజర్వాయర్ కట్ట

మర్రిగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మాకు అవాసం కల్పించండి.. 12 సంవత్సరాలుగా భరోసా లేకుండా బతుకుతున్నాం.' అని చర్లగూడెం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండజిల్లా మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్ కోసం 3,500 ఎకరాల్లో 12టీఎంసీల సామర్థ్యంతో అప్పటి సీఎం కేసీఆర్ 2015లో శివన్నగూడ పైలాన్ వద్ద శంకుస్థాపన చేశారు. రిజర్వాయర్‌లో నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, వెంకపల్లి, వెంకపల్లితండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. 2018లో రూ4.50 వేలు, 2020లో రూ.5.40లక్షల చొప్పున రెండు దఫాలుగా నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించారు. నాలుగు ముంపు గ్రామాల్లో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా 1200 కుటుంబాలను పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం అర్హులుగా గుర్తించారు. పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించలేదని, ఇప్పటివరకు పునరావాసం కల్పించలేదని నిర్వాసితులు వాపోతున్నారు. పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని రిజర్వాయర్ పనులు పూర్తి చేసుకుంటున్నారు తప్ప, తమ గోడు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.తల దాచుకోవడానికి నీడ లేకుండా పోయిందని కంటతడి పెడుతున్నారు.

ఇప్పటి వరకు అందని ధ్రువీకరణ పత్రాలు

పునరావసం కల్పిస్తామని చింతపల్లి మండలంలో సాయిబాబా టెంపుల్ సమీపంలో నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు 182 మంది లబ్ధిదారులగాను కేవలం 150 మందికి డ్రా పద్ధతిలో ఇళ్ల నెంబర్లు వేశారు. కాని ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదు. అదేవిధంగా చర్లగూడెం నిర్వాసితులకు పునరావాసం కోసం వర్కాల గ్రామ సమీపంలో ప్లాట్ల స్థలాలు ఇస్తామంటూ తీసుకెళ్లి ప్రభుత్వ స్థలాన్ని ఇంటి స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. కానీ అధికారులు ఇప్పటివరకు అందించలేదు.



సాగుని నమ్ముకుని జీవిస్తున్నాం..

సాగును నమ్ముకున్న తాము ఒక్కసారిగా సర్వం కోల్పోవడంతో గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. అధికారులు బలవంతంగా గ్రామాలు ఖాళీ చేయాలని ఇబ్బందులు గురిచేస్తున్నారని కన్నీరు పెడుతున్నారు. చర్లగూడెం రిజర్వాయర్ ముంపునకు గురవుతున్నా పూర్తిస్థా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించే విషయంలో భరోసా లేదని చెబుతున్నారు. ఆర్‌అండ్‌ఆర్, ప్యాకేజీ పునరావాసం కల్పించాలని నాలుగు ముంపు గ్రామాల బాధితులు కలిసి రిజర్వాయర్ పనులు అడ్డుకుంటే ఆ మండలంలో.. ఈ మండలంలో పునరావసం కల్పిస్తామంటూ, అర్హులైన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కూడా చెల్లిస్తామంటూ మాయ మాటలు చెప్పి కాలం వెళ్లదీస్తున్నారని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మాకు పునరావాసం కల్పించాలి



సర్వం కోల్పోయాం. ఇప్పటివరకు పునరావాసం లేదు. అర్హులైన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించలేదు. అధికారులు పునరావాసం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా రిజర్వాయర్ నిర్మాణం పనులు పూర్తి చేసుకుంటున్నారు. నష్టపరిహారం ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించామంటూ గ్రామాలను ఖాళీ చేయాలని బలవంతం చేస్తున్నారు. 12 సంవత్సరాలు గడుస్తున్నా బాధితులను ఆదుకోవడం లేదు. మేము ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి. పునరావాసం కల్పించి ఆదుకోవాలి.

- కేశవులు, ముంపు బాధితుడు, చర్లగూడెం

ఆస్పత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి

● ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురై చికిత్సపొందిన చిన్నారులు

నాగార్జునసాగర్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజక్షన్ వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థులు సోమవారం డిశ్చార్జి అయ్యారు. వైరల్ ఫీవర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు ఇచ్చిన యాంటీ బయాటిక్ ఇంజక్షనే ఇందుకు కారణమని భావిస్తున్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీలతోపాటు సాగర్ పరిసర గ్రామాలకు చెందిన చిన్నారులు విషజ్వరాలతో మూడు రోజుల క్రితం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో చేరారు. ఇంజక్షన్ వికటించడంతో 17మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో అందరూ కోలుకున్నారు. ఆదివారం 10 మందిని, సోమవారం మరో ఏడుగురిని డిశ్చార్జి చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్‌నాయక్ తెలిపారు. తమ సిబ్బంది రెండు రోజులు శ్రమించి చిన్నారులకు మెరుగైన వైద్యం అదించారని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎల్కా పూజ

నూతనకల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎల్కా పూజ అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అండర్-14 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాములునాయక్ తెలిపారు. పూజను హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్ చెరుకు నాగేందర్ ఉపాధ్యాయులు అభినందించారు.

గేయాలతో అవగాహన అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ తదితరులు

నల్లగొండ కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బాల గేయాలతో విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమని నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, రచయిత మేరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాకేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన 'ఊగుతున్న ఊయ్యాల' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు అంబటి వెంకన్న, గ్రంథాలయ మాజీ చైర్మన్ వినోద్‌రెడ్డి, పున్న అంజయ్య, ఎలికట్టె శంకర్‌రావు, వేణుగోపాల్‌చార్యులు, రాజేశం, శ్రీను, మల్లేశం, అరుణ, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం

● అద్దె చెల్లించలేదని భవన యజమాని ఆగ్రహం

అడ్డగూడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అద్దె చెల్లించడం లేదని ఆరోపిస్తూ భవన యజమాని యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం తాళం వేశాడు. నూతనంగా ఏర్పడిన అడ్డగూడూరు మండలకేంద్రంలో సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వం అద్దె భవనానికి నెలకు రూ.12,600లకు అద్దె చెల్లిస్తోంది. సోమవారం కార్యాలయం(భవనం) ఇంటి రెండున్నర సంవత్సరాలుగా అద్దె చెల్లించడం లేదని, సూమారుగా రూ.2.13లక్షలు రావల్సి ఉందని అద్దె యజమాని తెలిపాడు. సోమవారం ఉదయం 10 గంటలకు కార్యాలయం తాళం వేసినట్లు తెలిపారు. విషయమై తహసీల్దార్ శేషగిరిరావు మాట్లాడుతూ, కార్యాలయం భవన బకాయిలు బకాయి బిల్లు చెల్లించాల్సి ఉంది వాస్తమేనని, బకాయి బిల్లు గురించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు. ఇంటి యాజమానికి నచ్చజెప్పి ఉదయం 10గంటలకు కార్యాలయానికి వేసిన తాళాన్ని తీయించినట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేస్తున్న భవన యజమాని

గుట్టలో శివకేశవులకు విశేష పూజలు



యాదగిరిగుట్ట ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి శివాలయంలో స్ఫటిక మూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాల యం ముఖమండపంలో స్ఫటిక మూర్తులను వేదమంత్ర పఠనాలు, మంగళవాయి ద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. సుమారు 35వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉచిత దర్శన క్యూకాంప్లెక్స్, ఉభ య క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కొనసాగింది. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.36,04,621 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కొండకింద వ్రత మండపాల్లో 1,324 జంటలు పాల్గొన్నా యి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రొవిజన్స్, స్పోర్ట్స్, క్రీడలు ఐజీ రమేష్ స్వామివారిని దర్శించుకున్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి : ఈవో

అన్ని విభాగాల సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఈవో ఎస్. వెంకట్రావు సూచించారు. సోమవారం ఆయన పలు విభాగాలను పరిశీలించారు. గోశాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. వ్రత మండపం వద్ద దుకాణాల్లో వస్తువులను నిర్ణీత ధరలకే విక్రయించడంతో పాటు టెండరు ఒప్పందం ప్రకారం ప్రతి దుకాణంలో ధర పట్టిక ఉండాలన్నారు. సత్యదేవుడి వ్రతాలు జరిపించే భక్తులతో మాట్లాడి వ్రతాలు నిర్వహించే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పులిహోర ప్రసాద వితరణలో పరిశుభ్రత, నాణ్యత, పరిణామం మరింత మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు గజ్వేల్లి రఘు, జాటోత్ శంకర్‌నాయక్, నాగుల మహేష్‌గౌడ్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

చెర్వుగట్టుపై భక్తుల రద్దీ

నార్కట్‌పల్లి: కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. పుష్కరిణిలో స్నానం ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రధానాలయంలో మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. గుట్టపై ఉన్న ఉపాలయాలను సందర్శించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. కాగా ఆలయ పరిసరాలు పరిశుభ్రగంగా ఉంచాలని శివసత్తులకు, భక్తులకు ఈవో మోహన్‌బాబు అవగాహన కల్పించారు. మండలంలోని మాండ్ర-కక్కిరేణి గ్రామాల శివారులో ఉన్న స్వర్ణగిరి పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో సామూహిక సత్యదేవుని వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు.



కార్తీక పూజల్లో పాల్గొన్న భక్తులు

రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రభుత్వం

● కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 17,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనరసయ్య ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం 24గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో చేసిన డిక్లరేషన్ ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసగించిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవడంలేదన్నారు. ప్రభుత్వ వ్యవహార శైలితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం సకాలంలో స్పందించి ఉంటే రైతులకు ఇబ్బందులు తప్పేవని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను తప్పించడానికి కేంద్రం ప్రభుత్వం రబీ సీజన్‌కు సంబంధించి రూ.39వేల కోట్ల విలువైన ఎరువులను సబ్సిడీ రూపంలో అందజేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులను గాలికి వదిలేసిందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని డబ్బులను కేంద్రమే పంపిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కలిగించాలనే ఉద్దేశంతోనే బీజేపీ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టామని తెలిపారు. సన్న ధాన్యానికి ప్రకటించిన బోనస్ వెంటనే ఇవ్వాలని, ఫసల్ బీమా యోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, ఫకీర్ మోహన్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, పిన్నింటి నరేందర్‌రెడ్డి, శాంతి స్వరూప్, పోకల దశరథ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య

ఫొటో జర్నలిస్ట్ నాగేశ్వరరావుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

మిర్యాలగూడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ ఫొటో జర్నలిస్ట్ పుట్టా నాగేశ్వరరావుకు నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు(ఒడిస్సా) జాతీయ పురస్కారం లభించింది. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఒడిషాలో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయిలో వివిధ విభాగాలకు చెందిన 35మంది సీనియర్ జర్నలిస్ట్‌లకు అవార్డులు అందజే శారు. తెలం గాణ రాష్ట్రం నుంచి ప్రెస్ ఫొటోగ్రాఫర్ నాగేశ్వరరావు అవార్డు అందుకున్నారు. జాతీయ పురస్కారం అందుకున్న నాగేశ్వరరావును ప్రజాప్రతినిధులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు అభినందించారు.

సీసీఆర్టీ రిఫ్రెషర్ కోర్సులో శిక్షణ



విద్యాని శీతల్

గుర్రంపోడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలకేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు విద్యాని శీతల్ న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్(సీసీఆర్టీ)లో రిఫ్రెషర్ కోర్సు పూర్తిచేశారు. ఇటీవల ఆమె సీసీఆర్టీలో రిఫ్రెషర్ కోర్సుకు ఎంపికయ్యారు. ఈ నెల 10వ తేదీ నుంచి 14వరకు న్యూఢిల్లీలో శిక్షణ పొందారు. దేశంలోని సుమారు 13రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు ఈ కోర్సులో శిక్షణ పొందినట్లు శీతల్ తెలిపారు. శిక్షణలో భాగంగా గౌరియా, చౌనుత్యాలు, వార్లేఆర్ట్, రంగోళి, బీడ్ క్రాఫ్ట్ వంటి సంప్రదాయ హస్త కళలకు సంబంధించిన అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక, వినూత్న పద్ధతుల్లో భారతీయ సం స్కృతి వైవిధ్యం పట్ల విద్యార్థులకు ఎలా శిక్షణ ఇవ్వాలో అవగాహన కల్పించారని తెలిపారు. శీతల్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం తంతు నిర్వహిస్తున్న పండితులు

వలిగొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సుంకిశాల గ్రామంలో కొలుదీరిన వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. కళియుగ దైవం వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, మాంగళ్యమును పైళ్ల సోదరులు అందజేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశ్వరస్వామి కల్యాణం పద్మావతి, అలివేలు మంగ సమేత అమ్మవార్లతో ప్రత్యేక మండపంలో వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, సన్నాయి, రాగాల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. ముక్కోటి దేవతలు ఆహూతులుగా సృష్టికర్త బ్రహ్మదేవుడి సమక్షంలో వేంకటేశ్వరుడు లోక కల్యాణార్థం, సకల దేవతల నెలవైన లక్ష్మీఅమ్మవార్ల మెడలో సోమవారం శుభముహర్తం, శుభ గడియాల్లో మాంగళ్యదారణ గావించారు. కల్యాణ మహోత్సవ వేడుకలను యజ్ఞచార్యులు, అరుణ్‌కుమార్‌చార్యులు, దేవస్థానం ప్రధానార్చకులు సంతోష్‌కుమారాచార్యులు, యాదగిరిగుట్ట దేవస్థానం విశ్రాంత ప్రధానఅర్చకులు కారంపొడి నర్సింహచార్యులు, ఆధ్వర్యంలో జరిగింది. కల్యాణోత్సవంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పైళ్ల సోదరులు పైళ్ల అచ్చిరెడ్డి, రాజిరెడ్డి, మార్కెట్ చైర్మన్ బీమానాయక్, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు పాశం సత్తిరెడ్డి, తుమ్మల శ్రీనివాస్, తుమ్మల యుగేందర్‌రెడ్డి, కుంభం వెంకటపాపిరెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, బద్దం సంజీవరెడ్డి, పలుసం సతీష్‌గౌడ్, గూడూరి అశోక్‌రెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

పైళ్ల మల్లారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే

వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ దాత డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి-సాధన ఆధ్యాత్మిక, సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దైవదర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. వేంకటేశ్వరస్వామి దేవాయంలో కొలువుదీరిన ఉజ్జయిని మహంకాలి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేకంగా నైవేద్యాన్ని తయారు చేసి శివసత్తుల పూనకాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని భోనం సమర్పించారు. మండలంలోని సంగెం గ్రామ సమీపంలో శ్రీగంగా, గౌరీ సమేత భీమలింగేశ్వరస్వామి సమీపంలో స్వామివారి కల్యాణం నేత్రనందంగా జరిగింది. శివలింగానికి పంచామృతాలతో అభిషేకం జరిపి అర్చకులు వేదమంత్రాలతో పారాయణాలు చేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హన్మంతరావు, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బీమానాయక్, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, తహసీల్దార్ దశరథ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో ముస్లిం నిర్మించుకుంటున్న మసీదు పనులకు ఆయన ముస్లిం మత పెద్దలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని కులాలు, మతాలు, వర్గాలను సమదృష్టితో చూస్తుందన్నారు. కార్యక్రమంలోనాయకులు గుత్తా మాధవరెడ్డి, బి.సుందర్, కె.మహేందర్ రెడ్డి, టి.సాగర్, బి.దయాకర్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన బల్లెం సంతోష్ వైద్య ఖర్చులకై మంజూరైన రూ.రూ.1.25లక్షల విలువైన ఎల్‌వోసీని ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం అందించి మాట్లాడారు. సంతోష్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్సలో వెళ్లాడు. అక్కడి వైద్యులు చికిత్సకు భారీగా ఖర్చవుతుందనడంతో ఎమ్మెల్యే వీరేశం సహకారంతో ఎల్‌వోసీకి దరఖాస్తు చేశాడు. ఈ మేరకు మంజూరైన రూ.1.25లక్షల విలువ గల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి అందించారు. కార్యక్రమంలో నాయకులు బి.సుందర్, మెరుగుమళ్ళ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బస్సు జాతాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నలపరాజు రామలింగయ్య

చండూరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపోరాటాల్లో సీపీఐకు వందేళ్ల చరిత్ర ఉందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న సీపీఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభను డిసెంబరు 26న ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహిరంగసభ విజయవంతానికి మంగళవారం సాయంత్రం చండూరు పట్టణానికి బస్సుజాతా వస్తున్నట్లు తెలిపారు. ఈ జాతాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నర్సింహ కళాకారుల బృందం పాల్గొంటారు. పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా నాయకులు తిప్పర్తి రాములు, మండల కార్యదర్శి సతీష్‌కుమార్, బొడ్డు వెం కన్న, కర్నాటి వెంకన్న, వెంకటేశం, ఊశయ్య, సంజీవ పాల్గొన్నారు.

మిర్యాలగూడకు తరలిన కాంగ్రెస్ నాయకులు

కనగల్, నవంబరు 17:(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటనను పురస్కరించుకుని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస మండలాధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ మండల నాయకులు మిర్యాలగూడ పట్టణానికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎల్లమ్మ ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఆర్‌టీఏ సభ్యుడు రాజారెడ్డి నాయకులు భారతీవెంకన్న, గోలినర్సిరెడ్డి, గోలిజగాల్ రెడ్డి, పోచమళ్ల లింగయ్య, చిలకరాజు వెంకన్న, బోగరి రాంబాబు, నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావ్, రాజు, గోగు యాదయ్య, కేసాని వెంకట్‌రెడ్డి, నర్సింహ, దిలీప్‌రెడ్డి తదితరులున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

శాలిగౌరారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనిమద్దె గ్రామానికి చెందిన జనగం నాగరాజుకు రూ.6వేల సీఎం సహాయ నిధి చెక్కును మనిమద్దె కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గొల్ల రామచంద్రయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులో జాప్యం

● ఇబ్బందులు పడుతున్న నల్లగొండ 1వ వార్డు కాలనీవాసులు ● త్వరగా పూర్తి చేయాలని వేడుకోలు

నల్లగొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 1వ వార్డు పానగల్‌లో డ్రైనేజీ పైపులైన్ వేయడం కోసం రోడ్డును తవ్వారు. అనంతరం సీసీ రో డ్డు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.. పైపులైన్ వేయడం కోసం పాత రోడ్డును తవ్వి వేయడంతో పాటు డ్రైనేజీని కూడా తొలగించడంతో మురుగునీరు అంతా రోడ్డుపైనే పారుతోంది. నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయి. 25 నుంచి 30 ఫీట్లు ఉన్న ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో గుంతల్లో పడి వాహనదారులు ప్రమాద బారిన పడుతున్నారు. పైపులైన్ వేయడం కోసం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు మొత్తం తవ్వారు. రోడ్డు మొత్తం తవ్వినప్పటికీ నీటి పైపులైన్ వేయలేదు. దీనికి తోడు డ్రైనేజీ పైపులు పగిలినప్పటికీ పట్టించుకోని పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు పడినపుడు వరద నీరుతో పాటు మురుగు కాల్వ నీళ్లు అంతా తవ్విన రోడ్డుపై నుంచి చెరువును తలపించే పరిస్థితి ఏర్పడింది.



వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు

రోడ్డును వెంటనే నిర్మించాలి:



రోడ్డును తక్షణమే నిర్మించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలి. ఈ రోడ్డు గురించి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన కూడా పట్టించుకోవడం లేదు. మురుగు నీరు పారుతుండడంతో దోమల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు నెలలుగా ఇవే పరిస్థితులు నెలకొంటున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి. అనేక సార్లు గ్రీవెన్స్‌లో కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినప్పటికి మున్సిపల్ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే చర్యలు చేపట్టాలి. -గుండగోని నాగరాజు, పానగల్

మురుగు నీటితో దుర్వాసన

1వ వార్డులో తవ్వి రోడ్డు వేయని ప్రాంతంలో నీటి నిల్వల వల్ల దుర్వాసన రావడంతో పాటు పెద్ద ఎత్తున దోమలు సంచరిస్తున్నాయి. చాలా మంది జ్వరాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్‌కు, ఏఈకి పలుమార్లు చెప్పిన, వినతి పత్రాలు ఇచ్చిన స్పందించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డులో కొంత ప్రాంతం కంకర వేసి వదిలివేశారు. డ్రైనేజీ నీరు పొంగి పొర్లిపోతుండటంతో మురుగు గుంతలు ఏర్పడి కుక్కలు, పం దులు ఆ గుంటల్లోనే ఉంటున్నాయి. దీనికి తోడు ఈ గలు, దోమలు చేరి చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. ఈ రోడ్డు నుంచి ప్రతినిత్యం రాకపోకలు సాగించే ప్రజలు డ్రైనేజీ వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నాయి.

గణితం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి ఉపాధ్యాయ గణిత పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉయ్యాల వెంకటేశం తెలిపారు. బీఎస్సీతో పాటు బీఈడీలో గణిత మెథడాలజీ కలిగియుండి టెట్‌లో అర్హత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. అ ర్హులైన వారు ఈ నెల 19వ తేదీ వరకు దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేరోజు పాఠశాలలో డెమో నిర్వహించబడునని తెలిపారు.

బ్యాగుల పంపిణీ

మర్రిగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాల మేటిచందాపురం గ్రామ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సమితి అధ్యక్షులు అరుణ్ సాగర్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాగులు, నోట్ బుక్స్ అందజేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్, రజాక్, నరేష్, కొండల్ పలు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ సమావేశం జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసినటుప్ల చెప్పారు తెలిపారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా పిన్నం వీరాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నలపరాజు వెంకన్న, గౌరవాధ్యక్షుడుగా చొల్లేటి యోగేంద్రనాథ్, సహ అధ్యక్షుడిగా ఎండీ ఖైరుద్దిన్, ప్రధాన కార్యదర్శిగా ఆదిమల్ల శ్రీనివాస్, కోశాధికారిగా పటాలే వెంకట్‌రావును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. విస్తృత సమావేశాల్లో గతేడాది విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులు ఉపాధ్యాయుల సమస్యలను చర్చించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

టీఎస్ యూటీఎఫ్ కార్యవర్గాల ఎన్నిక

కనగల్ :నల్లగొండ పట్టణంలోని జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కనగల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా రెండోసారి ఎండీ. సైదుద్దీన్‌అహ్మద్, ఎ.రవీందర్‌ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వి.రాజు, బి.పరిపూర్ణ, కోశాధికారి ఆర్.సురేష్, కన్వీనర్ సీహెచ్‌సంధ్య, కార్యదర్శులుగా వి.అశోక్, బి.గంగాధరాచారి, డి.యాదగిరి, టి.పద్మ, బి.నాగమణి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకునిగా పగిళ్ల సైదులు వ్యవహరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, జిల్లా కార్యదర్శులు రామలింగయ్య, ఎన్‌వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి : టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్రా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా యనమల నరేష్, ఉపాధ్యక్షుడిగా యనమల ధర్మయ్య, సుజాతను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు నర్ర రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించి వారికి రావాల్సి పీఆర్‌సీలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ఎన్రోల్‌మెంట్ పెంచడానికి టీఎస్‌యూటీఎఫ్ బాధ్యతగా తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎడ్ల సైదులు, జి. అరుణ, సృజనకుమారి పాల్గొన్నారు.



నర్రా రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ

చేనేత కార్మికుల ధర్నాకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

నార్కట్‌పల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 20వతేదీన చేనేత కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్ కోరారు. సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా నేటికీ అమలు కాలేదన్నారు. చేనేత కార్మికుల సహకార సంఘాల వద్ద పేరుకు పోయిన వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, చేనేత కార్మికులకు రూ. 5లక్షల వరకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలన్నారు. చేనేత భరోసా పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు చెరుపల్లి రఘుపతి నేత, నాయకులు కందగట్ల నగేష్, పున్న నాగార్జున, చెరుపల్లి రాములు, మిర్యాల నరేందర్, నర్సింహా, రాయచంద్రం, చంద్రశేఖర్, వాసుదేవ్, వేణు, గోవర్ధన్, వెంకటేష్, సూర్యనారాయణ, రామయ్య పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నల్లగొండ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లకు మూడేళ్లుగా పెండింగ్‌లో లెప్రసి సర్వే బిల్లులు, అసెంబ్లీ, పార్లమెంటు ఎలక్షన్ డ్యూటీ డబ్బులు వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం స్కీములో భాగంగా జిల్లాలో 39 పట్టణ , గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు జిల్లా కేంద్ర హాస్పిటల్, ఏరియా హాస్పటల్‌కు అనుబంధంగా 1460 మంది ఆశా వర్కర్లు ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సలీం మాట్లాడుతూ జిల్లాలో పల్లె దావాఖాన పేరుతో ఏర్పాటైన సెంటర్లలో డ్యూటీల పేరుతో ఆశలను వేధిస్తున్నారన్నారు. పల్లె దవాఖానలు ఊడ్చడం, నీళ్లు పెట్టడం, డాక్టరు ఏఎన్‌ఎం వచ్చేవరకు తాళం తీసి అక్కడే ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయించడం న్యాయమా అని ప్రశ్నించారు. బీఎల్‌వో లుగా డ్యూటీలు తమకు సంబంధం లేకుండా వేస్తూ బెదిరించి ఆశలతో చేయిస్తున్నారని అన్నారు జిల్లా అధ్యక్షురాలు డి, మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, అవుట రవీందర్, అద్దంకి నరసింహ, ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి ఎదుళ్ళ సునీత, జిల్లా నాయకులు ఆర్ కవిత, సైదమ్మ, స్వర్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

మర్రిగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, మాజీ సర్పంచ్ నీలిమాచంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో పాత బస్టాండ్ వద్ద గ్రామపంచాయతీ స్థలంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధులు రూ.5లక్షల వ్యయంతో మడిగె నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నారు. భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్, ఎండీ యాసిన్ అలీ, బండ యాదయ్య, పొనుగోటి శేఖర్, మల్లేష్, యాదయ్య, రమేష్, రాపోలు, శ్రీశైలంలు ఉన్నారు.

శివలీలారెడ్డికి సేవాజ్యోతి పురస్కారం

కనగల్, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి) 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ లో ఆదివారం సాహిత్య సేవాసంస్థ, ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కనగల్ గ్రామానికి చెందిన సామాజిక సేవాకార్యకర్త కంబాల శివలీలారెడ్డి సేవజ్యోతి 2025 పురస్కారాన్ని అందుకున్నారు. ఇందులో భాగంగా శివలీలారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం శివలీలారెడ్డి మాట్లాడుతూ సేవాజ్యోతి పురస్కారాన్ని అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

మిర్యాలగూడను ఉన్నత స్థానానికి తీసుకెళ్తాం

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గానికి రూ.350కోట్లతో హ్యామ్ రోడ్లకు టెండర్లు పిలిచామన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని రూ. 10,500కోట్లతో, హైదరాబాద్-చిట్యాల రోడ్డును రూ.7,600కోట్లతో నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రూ.250కోట్లతో హ్యామ్‌రోడ్లు మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు.

కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్‌కుమార్, డీఈ శ్రీనివాస్, నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, షైబూబ్‌అలీ, నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరి బాలు, గాయం ఉపేందర్‌రెడ్డి, గుండు నరేందర్, శ్రీనివాసరెడ్డి పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రులు మూడు గంటలు ఆలస్యంగా రావడంతో పలు కార్యక్రమాలకు హాజరుకాకుండానే హైదరాబాద్ తిరిగివెళ్లారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

మిర్యాలగూడ నాలుగు లేన్ల రింగురోడ్డు పనులకు రూ.74కోట్లతో శెట్టిపాలెం-అవంతీపురం వద్ద శంకుస్థాపన చేశారు. రూ.15కోట్ల టీఎ ఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టిన రోడ్డు, రూ.16.25కోట్లతో మునిసిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రూ.41కోట్లతో బీటీ, సీసీరోడ్డు పనులు, రూ.15కోట్లతో మిర్యాలగూడ-తడకమళ్ల డబుల్‌రోడ్డును ఆరులేన్లుగా విస్తరించే పనులు, రూ.3కోట్లతో ఫ్లైఓవర్, మునిసిపల్ కార్యాలయం ఏరియా సుందరీకరణ పనులకు మంత్రులు శంకుస్థాపనలు చేశారు. రూ.5కోట్లతో కేఎన్‌ఎం డిగ్రీ కళాశాలలో నిర్మించిన అదనపు భవనం, జూనియర్ కళాశాలలో రూ.2.25కోట్లతో నిర్మించిన అదనపు భవనాన్ని మంత్రులు ప్రారంభించారు.

న్యాయం చేయండి



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుంచి అనేక మంది ప్రజలు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతున్నారు. వారిలో కొందరు కింది స్థాయిలో అధికారుల చుట్టూ తిరిగి తిరిగి చివరకు 'ప్రజావాణి'కి హాజరవ్వగా.. మరికొందరు మాత్రం అనేకమార్లు కలెక్టర్ కార్యాలయానికి వచ్చినప్పటికీ న్యాయం జరగక పోవడంతో మరో మారు వచ్చిన వారు ఉన్నారు. కాగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతన అధికారులతో కలసి వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అధికారులతో చర్చించి అక్కడిక్కడే పరిష్కరించగా మరికొన్ని సమస్యల పపరిష్కారానికి సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.

తప్పుడు రికార్డులపై విచారణ జరిపించండి



మేము మాగ్రామంలోని సర్వేనెంబర్ 906,907లలో భూములను కొనుగోలు చేసి వాటిలో కొంత భూమిని సేద్యం చేసుకుంటూ మరికొంత భూమిలో గొర్రెలు, మేకలను మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. అయితే ఇటీవలి కాలంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తపుడు పత్రాలతో తప్పుడు హద్దులను సృష్టించి తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని మమ్మల్ని, మా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల తమ ఇంటిపై దాడికి కూడా పాల్పడి తీవ్రంగా గాయ పరిచారు. వాస్తవానికి తాము భూమి కొనుగోలు చేసే సమయంలో సదరు వ్యక్తుల పేర్లు రికార్డుల్లో లేవు. ఇటీవలి కాలంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో తమను బెదిరించి తప్పుడు రికార్డులు సృష్టించి భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. దయచేసి దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, న్యాయం చేయండి.

-గొట్టె పార్వతమ్మ, బండ్ల వారిగూడెం, తిప్పర్తి మండలం

వీబీకే నుంచి సొమ్ము రికవరీచేయాలి



స్వయం సహాయక సంఘం సభ్యులు

మా గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా 12 మహిళా స్వయంసహాయక సంఘాలు పనిచేస్తున్నాయి. గ్రామనికి చెందిన ఓమహిళ బుక్‌కీపర్‌గా పనిచేస్తూ డ్వాక్రా రుణాలు ఇప్పిస్తూ ఉండేది. ఇదే క్రమంలో మహిళాసంఘాలకు చెందిన సభ్యుల ఆధార్‌కార్డులు, బ్యాంక్ పాసుబుక్స్ జిరాక్సులు తీసుకుని జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేటు బ్యాంకులో ఫీల్డ్ అసిస్టెంట్లతో కలసి 12 మహిళా సంఘాల డాక్యుమెంట్లతో వారి సంతకాలను ఫోర్జరీ చేసి రూ.1.50 కోట్లు స్వాహాచేసింది. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న తాము బ్యాంకు వెళ్లి మేనేజర్‌ను నిలదీయగా సదరు ఫీల్డ్ అసిస్టెంట్లు అప్పటికే రాజీనామా చేసి వెళ్ళి పోయారని మిగితా విషయాలు విచారణ చేసి చెబుతామని సమాధానం ఇచ్చారు. కావున దీనిపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుని సొమ్మును రికవరీ చేయాలి.

-స్వయం సహాయక సంఘం సభ్యులు, కేశరాజుపల్లి, నల్లగొండ

ఫలితాలు విడుదల చేయండి

2025-26 విద్యాసంవత్సరంలో 36 ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ప్రతీ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో ఒక ప్రైమరీ టీచర్‌ను, ఒక ఆయాను నియమించేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మాగ్రామ ప్రధానోపాధ్యాయుడు ప్రకటన విడుదల చేశారు. అర్హత గల నిరుద్యోగ ఎస్సీ, బీసీ మహిళలందరూ దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత విద్య అర్హతలున్న ఎస్సీ, బీసి కులాలకు చెందిన అభ్యర్థుల పేర్లను ఎంపికలో పరిగణలోకి తీసుకోవడం లేదు. దయచేసి తమ పేర్లను పరిగణలోకి తీసుకునేలా చర్యలు తీసుకొని మెరిట్ ఆధారంగా ఫలితాలు విడుదల చేయాలి.

-నిరుద్యోగ మహిళలు, బోయనపల్లి, కనగల్లు మండలం

జిన్నింగ్ మిల్లులు బంద్

(5వ పేజీ తరువాయి)

అదే వ్యాపారులు తిరిగి అవే మిల్లులకు విక్రయిస్తే దాన్ని జిన్నింగ్ చేసిన తర్వాత ఆ దూదిని సీసీఐ కొనుగోలు చేయడంలో మతలేబంటని రైతులు వాపోతున్నారు. రైతులపై బాధ్యతగా వ్యవహరించాల్సిన సీసీఐ ఇలా వ్యాపారధోరణితో వ్యవహరించడం అన్యాయమని వాపోతున్నారు. 7క్వింటాళ్ల నిబంధన సడలించి 13 క్వింటాళ్ల వరకు అనుమతించాలని, అదేవిధంగా తేమశాతాన్ని సడలించి 15శాతం వరకైనా కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అన్ని మిల్లుల్లోనూ పత్తి కొనుగోళ్లు నిర్వహించాలని డిమాండ్ రైతుల నుంచి, జిన్నింగ్ వ్యాపారుల నుంచి వస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో ఈసీజన్‌లో 57లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని, అందులో సగంమేరకైనా జిల్లాలో సీసీఐ ద్వారా కొనాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనావేశారు. ఈ మేరకు జిల్లాలోని 23 పత్తి జిన్నింగ్ మిల్లులను సీసీఐ సంసిద్ధం చేసింది. ఆయా మిల్లులతో జిన్నింగ్ నిమిత్తం అగ్రిమెంట్లు చేసుకుంది. అయితే ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనలు అమల్లోకి తేవడం, 7క్వింటాళ్లు, తేమశాతం నిబంధనలతో సీసీఐ కొనుగోళ్లు పూర్తిగా మందగించాయి. జిల్లాలో సుమారు రెండు నెలల నుంచి కొనుగోళ్లు సాగుతున్నా, ఇప్పటివరకు 15 మిల్లుల్లో 98,480 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలుచేశారు. ఇంకా రైతుల వద్ద పత్తి అలాగే ఉంది. జిల్లాలో తేమశాతం ఎక్కువగా ఉంటే సీసీఐ కొనుగోలు చేయకుంటే రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. క్వింటా రూ.5,500 నుంచి రూ.6,200 లోపు గ్రామాల్లోనే ఇళ్ల వద్ద వ్యాపారులకు విక్రయిస్తున్న పరిస్థితి జిల్లాలో ఉంది.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.20 (301.3570)	16,735	16,735
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.10 (4.22)	1,377.71	1,377.71
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.152	డ్రెస్ : రూ.230	స్కిన్‌లెస్ : రూ.260



జిన్నింగ్ మిల్లులు బంద్

పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలకు నిరసనగా జిన్నింగ్ మిల్లులు నిరవధిక బంద్ చేపట్టాయి. దీంతో ఇప్పటికే నిండా మునిగిన పత్తి రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- సీసీఐ నిబంధనలు సడలించాలని నిరవధిక సమ్మె
- జిల్లాలో పత్తి రైతులపై తీవ్ర ప్రభావం
- 7క్వింటాళ్లు, తేమశాతం నిబంధన సడలించాలంటున్న రైతులు

తెలంగాణ కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం జిల్లాలోని 23 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు నిలిచాయి. సీసీఐ ఈఏడాది అమలులోకి తెచ్చిన నిబంధనలు రద్దుచేయాలని, కొన్ని మిల్లులే కాకుండా అన్ని మిల్లుల్లో కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలనే డిమాండ్‌తో జిన్నింగ్ మిల్లులు నిరవధిక బంద్‌లో పాల్గొంటున్నాయి. ఇప్పటికే తొలకరిలో వర్షాల్లేక పైరు ఎదుగుదల లోపించడం, తీరా పత్తి తీత దశలో అధిక వర్షాలతో తడవడం, తేమ ప్రభావం వంటి కారణాలతో నిండామునిగిన పత్తి రైతుకు తాజాగా, జిన్నింగ్ మిల్లుల బంద్‌తో మరింత ఇబ్బందికరంగా మారింది.

కొనుగోళ్లు తగ్గించడమే లక్ష్యంగా సీసీఐ నిబంధనలు!

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పలు నిబంధనలు అమలులోకి తెచ్చింది. పత్తి సాగుచేసిన రైతులు 'కపాస్ కిసాన్' యాప్‌లో నమోదు చేసుకుని, ఆ యాప్ ద్వారానే పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎకరాకు రూ.7క్వింటాళ్ల వరకు మాత్రమే ఒక్కో రైతు విక్రయించేందుకు సీసీఐ ఆమోదిస్తోంది. అదేవిధంగా తేమ 8 నుంచి 12శాతానికి లోబడి ఉంటేనే సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేస్తారు. అదే విధంగా అంతర్ జిల్లాలోనే పత్తిని విక్రయించాలని, జిల్లాలోని మిల్లుల్లో అన్నింటిలో ఏక సమయంలో పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తే బేళ్ల తయారీ, తరలింపు, సిబ్బంది కొరత వంటి కారణాలను చూపుతూ మిల్లులను మూడు కేటగిరీలుగా విభజించారు. ఎల్-1, ఎల్-2,ఎల్-3గా మిల్లులను విభజించి తొలుతఎల్-1 కేటగిరీ మిల్లుల్లో సామర్థ్యంమేరకు పత్తినికొనుగోలు చేశాకే ఎల్-2జాబిత మిల్లులు, ఆపై ఎల్-3 జాబితా మిల్లులకు పత్తిని కేటాయిస్తున్నారు. దీంతో పత్తి రైతులు విక్రయాల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని మిల్లులకు జిన్నింగ్ కొనసాగించే పరిస్థితి లేకుండాపోయింది. రైతుల నుంచి కొనుగోళ్లను తగ్గించాలనే లక్ష్యంతోనే సీసీఐ ఇలాంటి విధానం అమల్లోకి తెచ్చిందని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో అన్ని మిల్లులను సీసీఐ లీజుకు తీసుకుందని, సీజన్‌లో అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు నిర్వహించకుంటే మిల్లులు నష్టపోవాల్సి వస్తోందని చెబుతున్నారు. తలాతోకలేని సీసీఐ నిబంధనలను ఎత్తివేస్తే తప్ప జిన్నింగ్ ప్రారంభించేది లేదని మిల్లుల యాజమాన్యాలు తేల్చిచెప్పి సమ్మెకు దిగాయి.

తక్షణం నిబంధనలు సడలించాలని డిమాండ్

జిల్లాలో పత్తి మిల్లులు బంద్ ప్రకటించడంతో మరింత నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అధికవర్షాల నేపథ్యంలో దిగుబడులు తగ్గి నష్టపోతే, తాజాగా, తేమపేరుతో ధర ఎగ్గొడుతున్నారని, ఇప్పుడు మిల్లుల బంద్‌తో మరింత నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీసీఐతో చర్చించి 7క్వింటాళ్లు, తేమశాతం నిబంధనలతో పాటు అన్ని మిల్లులు నడిచేలా నిబంధనలు సడలించేందుకు ఒప్పించాలని రైతులు కోరుతున్నారు.

రైతులకూ నిబంధనలు విధించిన సీసీఐ

రైతుల విషయంలోనూ పత్తి కొనుగోళ్లపై పలు ఆటంకాలు సృష్టిస్తోందని వారు వాపోతున్నారు. ఎకరాకు 7క్వింటాళ్ల నిబంధన సహేతుకం కాదని రైతులు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో రైతులు బోరుబావుల కింద, కాల్వల కింద పత్తి సాగుచేశారు. అలాంటి చోట్ల ఎకరాకు 20 క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తోందని, అదేవిధంగా ఆరుతడిగా సాగుచేసిన చోట్ల కూడా పరిస్థితి అనుకూలించి సకాలంలలో వర్షాలు కురిస్తే ఎకరాకు కనీసం 15క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు వస్తాయని, బీటీ-2 సాగుపెరిగాక దిగుబడులు గణనీయంగా పెరిగిన విషయాన్ని సీసీఐ గుర్తించడం లేదని వాపోతున్నారు. వీటికి తోడు ఈ ఏడాది తేమశాతం కూడా రైతులను ఇబ్బందికి గురిచేస్తోంది. సీసీఐ నిబంధనల ప్రకారం 8 నుంచి 12శాతం వరకు తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తారు. అంతకుమించితే పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు అగ్గువకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు

- మిగతా 8వ పేజీలో...

మిర్యాలగూడను ఉన్నతస్థానానికి తీసుకెళ్తాం

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రూ.238కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డితో కలిసి శంకుస్థాపన



మిర్యాలగూడలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రి కోమటిరెడ్డి, తదితరులు

మిర్యాలగూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ నియోజకవర్గాన్ని ఉన్నతస్థానానికి తీసుకవెళ్తామని నీటిపారుదలశాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలో రూ.171.5కోట్ల అభివృద్ధి పనులకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రారంభించిన ఐదు ఎత్తిపోతల పథకాలను ఏడాదిలో పూర్తిచేసి నూతన ఆయకట్టును సాగులోకి తెస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర ప్రకియగా అర్హులైన వారికి రేషన్‌కార్డులను జారీ చేస్తోందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు దృఢ సంకల్పంతో ముందుకుసాగుతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వినతి మేరకు సాగర్ ప్రధాన కాల్వ లైనింగ్‌కు రూ.57కోట్లు, నియోజకవర్గంలో దుబ్బతండ, శాంతినగర్, రావులపెంట చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.24కోట్లు, ఫీడర్ ఛానళ్ల నిర్మాణానికి సూమారు రూ.20కోట్లు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు.

రూ.250కోట్లతో రోడ్ల నిర్మాణం : మంత్రి కోమటిరెడ్డి

నియోజకవర్గంలో రూ.250కోట్లతో హ్యామ్ రోడ్లు మంజూరు చేశామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి, డబుల్‌రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాగార్జునసాగర్‌కు రూ.450కోట్లు, దేవరకొండ

- మిగతా 8వ పేజీలో...

ప్రజలకు చేరువగా పోలీస్‌శాఖ

ఎస్పీ శరత్‌చంద్ర పవార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 28 మంది ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. ఫిర్యాదుల సేకరణకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకవిభాగం పనిచేస్తోందన్నారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామన్నారు.

తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల


తాటికల్ వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల

నకిరేకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పిల్లలు చివరి దశ వరకు జాగ్రత్తగా చూసుకోవాలని మండల న్యాయ సేవాధికారి, సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల అన్నారు. సోమవారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్ మండలం తాటికల్ వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులను పిల్లలు జాగ్రత్తగా చూసుకుంటే వృద్ధాశ్రమాలు తగ్గుతాయన్నారు. జూనియర్ సివిల్ జడ్జి షేక్ హనీఫ్ మాట్లాడుతూ, పిల్లలకు విలువ తెలిసినప్పుడే తల్లిదండ్రులను సరిగా చూసుకుంటారని, అందుకే ఆస్తులను వారి పేర రాయవద్దని సూచించారు. అనంతరం వృద్ధులకు జడ్జి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల, దివ్యాంగుల, స్త్రీశిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ప్యానల్ అడ్వకేట్లు డి.సోమయ్య, సీహెచ్.నాగరాజు, పీఎల్ వి.వెంకటేశ్వర్లు, వృద్ధాశ్రమ ట్రస్ట్ చైర్మన్ ఎన్.రామ్మోహన్‌రావు, యాదగిరిరెడ్డి, వై.మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా అన్నెబోయిన మట్టయ్య


అన్నెబోయిన మట్టయ్య

నల్లగొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ (డీసీసీసీ) నూతన జిల్లా అధ్యక్షుడిగా అన్నెబోయిన మట్టయ్య ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని డీసీఐసీ కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కట్టమనోహర్, ఉపాధ్యక్షుడిగా ఎండీ అస్మా, ఎండీ.ముస్తాఫా, ఎండీ.నజీర్‌పాషా, సహాయ కార్యదర్శులుగా తిరందాసు ఆంజనేయులు, పసునూరి రాంబాబు, ప్రచార కార్యదర్శిగా దువ్వా గీత, కోశాధికారిగా కొప్పోలు విమలమ్మ, డివిజన్ కార్యదర్శులుగా పోలగాని వెంకటేశ్వర్లు, సీహెచ్.సాంబశివరావు, రాపోలు శివకుమార్, గండూరి నరసింహ, కార్యవర్గ సభ్యులుగా జూలూరు వెంకటేశం, ఏమిరెడ్డి రవీందర్‌రెడ్డి, బత్తిని లక్ష్మయ్య, పొట్టబత్తిని సత్యం, కౌసల్య ఎన్నికయ్యారు. జిల్లా పౌరసరఫరాలశాఖ ఏఎస్‌వో రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలను డీసీఐసీ కన్వీనర్ చింతమళ్ల గురవయ్య, కట్టికోల నరసింహరావు, సీఏటీసీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు నిర్వహించారు. జిల్లాలో వినియోగదారుల హక్కుల పరిరక్షణతో పాటు, వినియోగదారుల రక్షణ చట్టం అమలుకు తమవంతుగా కృషి చేస్తామని, వినియోగదారుల్లో చైతన్యాన్ని తీసుకువచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రకటించింది.

'ప్రజావాణి' ఫిర్యాదులు పరిష్కరించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి


ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 17,(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించారు. వర్షం కారణంగా గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. డెంగీ లాంటి వ్యాధులు రాకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా పూర్తిగా శానిటేషన్ చేయాలన్నారు. ఈ కార్యమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 129 ఫిర్యాదులు వచ్చాయి.

ఆడబిడ్డల సంరక్షణ అందరి బాధ్యత

నల్లగొండ రూరల్: ఆడబిడ్డల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సేవ్ ద చైల్డ్ జిల్లాస్థాయి కార్యచరణ ప్రణాళికపై కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, బాల్య దశలోనే గర్భం దాల్చడం వంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఆడబిడ్డను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ (వీసీపీసీ)లో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పాలన అధికారులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా ఏర్పాటు చేయాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా పకడ్బందీ తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తే వెంటనే సమాచారం తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. పెద్దవూర, తిరుమలగిరి సాగర్, దామరచర్ల, పీఏపల్లి వంటి మండలాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో బాల్య వివాహాలు, ఆడపిల్లల అక్రమదత్తత, బాల్య వివాహాలపై దోస్తు బాక్సులు ఏర్పాటు చేయాలని అదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్యవివాహాలు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం, తదిత అంశాలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

బాలికల హాస్టళ్లు, పాఠశాలలతో పాటు, బాలుర హాస్టల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా చెల్డ్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, చారుమతి ఎన్జీవో అధ్యక్షుడు నాగసేనారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఈవో బిక్షపతి, నల్లగొండ ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి ఉన్నారు.


ఈపీఎస్ పింఛన్‌దారులను ఆదుకోవాలి



ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, వివిధ ప్రైవేట్ సంస్థల్లో పనిచేసి రిటైర్ ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించి, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం టాప్రా ఆధ్వర్యంలో జిల్లా ప్రావిడెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం చెల్లించాలని, తక్షణమే హయ్యర్ పెన్షన్‌ను వివక్ష లేకుండా అందరికీ వర్తింపజేసి, ఈపీఎఫ్ ప్రైవేటీకరణను ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈపీఎస్-95 పెన్షన్ స్కీమ్ పేరుతో అమలవుతున్న పెన్షన్ నెలకు రూ.వెయ్యి అంతకులోపే వస్తోందన్నారు. అందుకే కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని 7వ వేతన సవరణ సంఘం సిఫార్సు చేసిందని కానీ ప్రభుత్వం ఆ స్థోమత లేదని చెబుతూ కార్పొరేట్లకు అనేక రాయితీలతో షేక్ హ్యాండ్ ఇస్తూ ఈపీఎస్ పెన్షనర్లకు మొండి చేయి చూపిస్తుందన్నారు. దేశం ఆర్థికంగా పెరిగినా పెన్షన్ పెరగడం లేదని, నిత్యం ధరలు పెరుగుతున్నా పెన్షన్‌కు రక్షణ లేదని కనీస అవసరాలు తీర్చని పెన్షన్ ను ప్రవేశపెట్టడమే మోసపూరితమని అందుకే ఈపీఎస్ పెన్షనర్లు పెన్షన్ విద్రోహ దినం పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎండీ. అబ్దుల్ ఖాదర్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బానాల పరిపూర్ణాచారి, గుండాల బిక్షమయ్య, రాపోలు వెంకటేశం, కొమ్మారెడ్డి రాయపురెడ్డి, పట్టేటి కృష్ణయ్య, మౌలానా ఆస్కార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు పెంచాలి


రైతులు సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

దామరచర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పత్తికి మద్దతు ధర ఇచ్చి, సీసీఐ కొనుగోలు కేంద్రాలను పెంచాలని రైతు సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కల్లేపల్లి గ్రామంలో పత్తి పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. వరి పంట తర్వాత రైతులు పత్తి రంటను అధికంగా సాగు చేస్తారని, పెట్టుబడి ఎకరాకు సుమారు రూ.50వేల వరకు ఖర్చు చేస్తారన్నారు. విత్తనాలు దొరకక, యూరియా అందుబాటులో ఉండక, నకిలీ పురుగుమందులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు రవినాయక్, మాలోతు వినోద్‌నాయక్, లావుడియా ఎర్రనాయక్, దయాకంద్ సుభాని, విజయ్, వెంకటయ్య, ప్రసాద్, లక్ష్మయ్య, హచ్చు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని కట్టడి చేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



డిండిలో ప్రచారజాతలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

డిండి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మతోన్మాద బీజేపీని దేశంలోని వామపక్ష లౌకికశక్తులు కట్టడిచేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ప్రచారజాతాకు సోమవారం డిండి మండల కేంద్రంలో ఆయన స్వాగతం పలికారు. రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ స్వతంత్ర సంస్థలను ఉపయోగించుకొని అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థ బ్యాంకులను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. నేరచరిత్ర ఉన్నవారు చట్టసభలకు ఎన్నికవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిని నియంత్రించడానికి ఎన్నికల సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనని ఖమ్మం బహిరంగ సభ ద్వారా సంకేతాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతలులేని నూతన సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతోందని తెలిపారు. ఈనెల 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నర్సింహ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైందని తెలిపారు. దేశ భక్తులమని చెప్పుకునే బీజేపీ ఏం త్యాగాలు చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాలనర్సింహ, పల్లా నర్సింహరెడ్డి, పయాజ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, బి.వెంకటరమణ, టి.బుచ్చిరెడ్డి, ఎండి.షైనుద్దీన్, ఎస్ఆర్.కనకచారి, శైలేజ్, విజేయేందర్‌రెడ్డి, ఎనమళ్ల నవీన్, నూనె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐటీఐ క్యాంపస్‌లో 19న జాబ్ మేళా

నల్లగొండ కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 19వ తేదీన ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎస్. పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, గ్రాడ్యుయేట్, ఫార్మసీ చదివిన విద్యార్థులు హాజరుకావాలని కోరారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి నల్లగొండ, హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• కన్నుల పండువగా మహాపడి పూజ


పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప మండల పూజ మహోత్సవంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొన్నారు. • పెద్దఅడిశర్లపల్లి

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



నిడమనూరు: రాజన్నగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, గుర్రంపోడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటి రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు మండలం వెని గండ్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో రాజన్నగూడెం, గుర్రంపోడు మండలం చేపూరు, తేరా టిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, నిడమనూరు మండలం సూరెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వేర్వేరుగా ప్రారంభించి మాట్లాడారు. ధాన్యానికి మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిడమనూరు కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, సొసైటీ చైర్మన్ కేవీ రామారావు, సీఈవో నలపరాజు వెంకన్న. కొండా శ్రీనివా‌స్‌రెడ్డి, శివమారయ్య, పోలే డేవిడ్, చేకూరి వంశీ, పోలే రవి, గోగుల ఎల్లేష్, ఇసాక్, డైరెక్టర్లు, సిబ్బంది రవి, లింగయ్య గుర్రంపోడు మండలంలో తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, కంచర్ల వెంకటేశ్వర‌రెడ్డి, కాటేపల్లి రాధాకృష్ణ, బొమ్ము శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, సత్తయ్య, రమేష్, వెంకన్న, ఏవో కంచర్ల మాధవరెడి పాల్గొన్నారు.

వైభవంగా తులసీ దామోదర కల్యాణం

చింతపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన వూరె యాదయ్య మామిడి తోటలో సోమవారం వైభవంగా తులసీ దామోదర కల్యాణం, సత్యనారాయణ వ్రతం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన చేపట్టారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నవితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వూరె లక్ష్మణ్ శ్రీదేవి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్ కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర రాయకుడు అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్క ర్, సీతరాములు, గోవింద్ రాజ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోటమైసమ్మ బ్రహ్మోత్సవాలు



ఆలయ ఆవరణలో బలి చల్లుతున్న నిర్వాహకులు

నిడమనూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామం సమీపంలో ప్రసిద్ధ కోటమైసమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. పవిత్ర కార్తీకమాసంలో ఆలయంలో మూడురోజులు జరిగే ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం సుప్రభాత సేవ, గణపతిపూజా, బాలభోగము, బలిహరణం, కుంభం, నైవేద్యం సమర్పణ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆగమశాస్త్ర ప్రకారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూజ కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం అమ్మవారికి ఉదయం బోనాల సమర్పణ, సాయంత్రం కార్తీకదీపోత్సవం వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చౌటి ఆంజనేయులు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ సిబ్బంది విఠలేశ్వర్, రమణయ్య, రాజు, నార్ల శ్రీనివాస్, నర్సిరెడ్డి, లక్ష్మి, పద్మ, కోటయ్య, వెంకన్న పాల్గొన్నారు.


పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి



వీ.టీనగర్ జడ్పీహెచ్ఎస్‌లో రంగులు వేస్తున్న పూర్వ విద్యార్థి

చింతపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని వీ.టీ.నగర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కృష్ణవేణి కోరారు మండలంలోని వేంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌కు పూర్వ విద్యార్థులు కలిసి తరగతి గదులకు పెయింట్ పనులు మమ్మరంగా ప్రారంభించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వ్యక్తిత్వంతో పాటు ప్రణాళికతో చదివితే ఉన్నస్థాయికి చేరే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలోఆధ్యాపక బృందం ఎండీ.అన్వర్, వోలీ సుధీర్‌కుమార్, పూర్వ విద్యార్థులు ఇడుకుళ్ల రాంమోహన్, సందపట్ల రాజేష్ సాగర్, లక్ష్మణ్ సాగర్, బొడ్డుపల్ల కరుణాకర్, పోలగోని బాల్‌రాజ్ పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సభ్యులకు గుర్తింపు కార్డులను అందచేస్తున్న చైర్మన్ జడ రాములుయాదవ్

వేములపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్ అన్నారు. స్థానిక రైతువేదికలో సోమవారం నిర్వహించిన సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం పరిధిలో ఇప్పటివరకు .2.356 మంది సభ్యులుగా ఉన్నారని, వీరికి వ్యవసాయ అభివృద్ధికి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎరువులు పొందడానికి గుర్తింపు కార్డులను అందచేశారు. సమావేశంలో ఏవో కిశోర్‌నాయక్, ఏఈవో నితిన్, మాజీ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్, వైస్ చైర్మన్ వల్లపుదాసు పద్మ, డైరెక్టర్లు శంకర్ రెడ్డి, మాధవ్‌రెడ్డి, సీఈవో రవీందర్‌రావు, సిబ్బంది యాదగిరి, శేఖర్, నాగరాజు, గిరి, జీవన్‌కుమార్, సురేంద్రచారి, రైతులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాలు బోర్డులకే పరిమితం

● గ్రామాల్లో నిరుపయోగంగా ఆట స్థలాలు

గుర్రంపోడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద 2021 సంవత్సరంలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటు చేసింది. క్రీడాప్రాంగణాలకు స్థలాల ఎంపిక ప్రధాన సమస్యగా మారింది. ఎకరం స్థలం ఎంపిక చేయాల్సి ఉండగా కనీసం పావు ఎకరం కూడలేక అనువైన ప్రభుత్వ స్థలాలు దొరకకా ఎక్కడ బడితే అక్కడ ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో గ్రామపంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌కు అన్ని పథకాల ప్రారంభం జరిగినట్లు చూపించాల్సిన ఉండడంతో హడావుడిగా అనువు గాని చోట్ల స్థలాల ఎంపిక చేసి బోర్డులను పాతించి చేతులు దులుపుకున్నారు. అప్పటి కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి ఆట వస్తువులు (పోల్స్) కొనుగోలు పాతించారు. ఆ తరువాత ఉపాధి హామీ నిధులతో రూ.87వేల అంచనాలతో పూర్తిస్థాయి లో అందుబాటులోకి తీసుకొని రావాల్సి ఉండగా వీటిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో అంతటితో నిలిచిపోయింది. సరఫరా చేసినవాటిలో వాలీబాల్, హై జంప్, లాంగ్ జంప్, ఫుట్‌బాల్ పరికరాలు అరకొరగానే ఏర్పాటు చేశారు. క్రికెట్ కిట్లు, టీ షర్టులు సరఫరా జరిగిన అవి ఎక్కడ కూడ కనిపించడంలేదు. క్రీడా ప్రాంగణాలకు కనీసం ఎకరం స్థలంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ గ్రామాల్లో స్థలం కొరతతో పది గుంటల భూమి కూడ లేనిచోట స్థలాలను గుర్తించి నిర్మాణాలు చేపట్టారు. ప్రాంగణాల వ్య యాన్ని ఉపాధి హామీ నిధుల నుంచి కేటాయించాల్సి ఉండగా పరికరాలు నాణ్యతా లేకపోవడం, స్థలాల ఎంపిక సక్రమంగా లేక ఉపాధి నిధులను వీటిని మంజూరు చేయలేదు. దీంతో మండలంలో 37 గ్రామపంచాయతీలకు అన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేసిన గుర్రంపోడు, కాల్వపల్లి గ్రామాల్లో మాత్రమే ఉపాధి నిధులను ఒక్కొక్కటి రూ.50వేల వరకు ఖర్చు చేసి పూర్తిగా వినియోగంలోకి తెచ్చారు.

కొన్ని గ్రామాల్లో గ్రామానికి దూరంగా క్రీడా ప్రాంగణాల స్థలాలను ఎంపిక చేసి దీంతో అవి వృథాగా మారాయి.



ఆమలూరు వాగులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

వినియోగంలోకి తేవాలి



క్రీడా ప్రాంగణాల్లోసరైనా ఏర్పాట్లు లేవు. అరకొర పరికరాలతో నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు సరిపడా నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసేలా క్రీడా ప్రాంగణాలు ఉండాలి.

- పందుల రమేష్, క్రీడాకారుడు

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న బిల్యానాయక్

దేవరకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకుడు కేతావత్ బిల్యానాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని తుల్జమ్మ కుంట ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం పూజలు చేసి అన్నదానం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఆలయకమిటీ నిర్వాహకులు బిల్యానాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి గురుస్వాములు గిరి స్వామి, గెల్వయ్య, నాగార్జున, కుంభం శ్రీను, నీల రవికుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చింతపల్లి పెద్దచెరువులో చేపలను వదలుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అం దిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ కనుకు వెంకటరమణ, డెరెక్టర్లు వెలుగు రవి, శ్రీను, లక్ష్మి, వీరయ్య, ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ విజయ లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, దొంతం సంజీవ రెడ్డి, అంగిరేకుల గోవర్ధన్,కొండూరి పవన్‌కుమార్, మాస భాస్కర్, ఎండీ.జహంగీర్, మొక్తాల శేఖర్, మేకల నరసింహ, ఉపాధ్యక్షుడు కొప్పెర శ్రీశైలం పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేయూత నివ్వడానికే చేపపిల్లల పంపిణీ : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : మత్స్యకారులకు చేయూత నివ్వడానికే జలాశయాల్లో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేపట్టినట్లు సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. స్థానిక హిల్‌కాలనీ ఎర్త్ డ్యాం వద్ద చిల్డ్రన్ పార్కు, పుష్కర ఘాట్ వద్ద చేప పిల్లల విడుదలను ప్రారంభించారు. ముందుగా కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం జలాశయంలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో మొత్తం రూ.1.13 కోట్లతో సాగర్ జలాశయంతో పాటు మండలాల పరిధిలో చెరువుల్లో చేప పిల్లలను వదులుతున్నామన్నారు. సాగర్ జలాశయంలో 27 లక్షల చేప పిల్లలను రూ.40.86 లక్షలతో వదులుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రమణ, ఉపాధ్య క్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి తాతారావు, మాజీ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు దేవుడు, బంగారి, అప్పారావు, హాలి యా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముస్లిం మతపెద్ద జావిద్ హుస్సేన్ ఖాస్మీ మృతి

● సంతాపం తెలిపిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్



హుస్సేన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,ఎమ్మెల్యే బాలు నాయక్



జావిద్ హుస్సేన్(ఫైల్)

దేవరకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి చెందిన ముస్లిం మత పెద్ద ముఫ్తీ మహమ్మద్ జావిద్ హుస్సేన్ ఖాస్మీ సాహెబ్(63) ఆదివారం రాత్రి గుండెపోటులో మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలియగానే పట్టణంలోని ప్రముఖులు, ముస్లిం పెద్దలు, వివిధ పార్టీల నాయకులు సోమవారం ఉదయం ఆయన నివాసానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. జావిద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మసీదుల నిర్మాణ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. సమాజశాంతి, ఆధ్యాత్మిక సేవలు అందించారు.శాసనమండలి చైర్మన్ గుత్తా సఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, వివిధ పార్టీల నేతలు ఆయన నివాసానికి చేరుకొని సంతాపం తెలిపి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం అశ్రునయానా ల మధ్య దేవరకొండలో అంతిమసంస్కారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ పార్టీల నాయకులు, ముస్లిం మతపెద్దలు, అభి మా ను లు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఎంపి సిరాజ్‌ఖాన్, ఎండీ యూనుస్, జాల నర్సింహరెడ్డి, వడ్త్య దేవేందర్‌నాయక్, పల్లా నర్సింహరెడ్డి, జాన్‌యాదవ్, నజీర్ అహ్మద్, సత్తార్, రిజ్వాన్, గాజుల అంజనేయులు సంతాపం తెలిపారు.

దామోదర్ కుటుంబానికి పరామర్శ

దేవరకొండ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గార్లపాటి దామోదర్ సతీమణి లీలావతి ఇటీవల మృతి చెందారు. దీంతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సోమవారం దామోదర్‌ను వారు పరామర్శించారు. దేవరకొండ వార్డు కౌన్సిలర్‌గా, సామాజిక సేవ పరంగా ఆమె సేవలు అందించిందని గుర్తు చేశారు.

క్షయ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



చింతపల్లిలో ఎస్ఐ, సిబ్బందికి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న జిల్లా టీబీ బృందం సభ్యులు

చింతపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ రాం మూర్తి అన్నారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జిల్లా క్షయవ్యాధి నివారణ కేంద్రం ఆధ్వర్యంలో ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బందికి వైద్య సిబ్బంది మొబైల్ ఎక్స్‌రే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాం పల్లి ఎస్ఐ లింగారెడ్డి, మండల వైద్యాధికారి శ్రీదేవి, జిల్లా టీబీ కో ఆర్డినేటర్ మోత్కూరు శ్రీనివాస్, సూపర్ వైజర్లు మల్లికార్జున్, వసం త, జనార్దన్, హెల్త్ అసిస్టెంట్ యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం : ఎస్ఐ

చింతపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎస్ఐ రాం మూర్తి తెలిపారు. నకిరేకల్‌లో స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో ఛాంపియన్ షిప్ (అండర్-8 నుంచి 20) పోటీలు నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన మాతృశ్రీ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ఆయన అందించారు.

సమస్యల పరిష్కారమే టీఎస్ యూటీఎఫ్ లక్ష్యం




ఎరనాగుల సైదులు, రేవల్లి రాజేష్




శ్రీనివాస్‌రావు,శ్యామ్‌కుమార్

తిరుమలగిరి(సాగర్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీఎస్ యూటీఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎరనాగుల సైదులు, రేవల్లి రాజేష్ అన్నారు. మండల కేంద్రంల టీఎస్‌యూటీఎఫ్ తిరుమలగిరి(సాగర్) మండల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సోమవారం తెలిపారు. నూతన అధ్యక్షుడిగా సైదులు, ప్రధాన కార్యదర్శిగా రేవల్లి రాజేష్, ఉపాధ్యక్షుడిగా పత్తిపాటి వినయ్‌కుమార్, గంజి శ్రీదేవి, కోశాధికారిగా షేక్ జానిపాషా, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా బత్తిని శైలజ, సోషల్ మీడియా కన్వీనర్ ఎం.రాజేష్, వాయిస్ ఆఫ్ తెలంగాణ పత్రిక కన్వీనర్‌గా పి.మౌనిక ఎన్నికైనట్లుపేర్కొన్నారు. కొత్త కార్యవర్గానికి మండల ఉపాధ్యాయులు శుభకాంక్షలు తెలిపారు.

దామరచర్ల మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు

దామరచర్ల : టీఎస్‌యుటీఎఫ్ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా పి.సైదమ్మ, ఉపాధ్యక్షులుగా కరుణా కర్‌రెడ్డి, కోశ ాధికారిగా వెంకటేశ్వర్లు, ఎఫ్‌డబ్లుఎఫ్ కన్వీనర్‌గా ఎస్‌కె.సయ్యద్‌భాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెం డింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని, సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాస్‌చారి, జి ల్లా కార్యదర్శి మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, చిన్న వెంకన్న, వేదశ్రీ, సైదులు, మట్టమ్మ, పద్మ, నరేష్, కరీం, జానయ్య పాల్గొన్నారు.

మిర్యాలగూడను ఉన్నత స్థానానికి తీసుకెళ్తాం

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గానికి రూ.350కోట్లతో హ్యామ్ రోడ్లకు టెండర్లు పిలిచామన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని రూ. 10,500కోట్లతో, హైదరాబాద్-చిట్యాల రోడ్డును రూ.7,600కోట్లతో నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రూ.250కోట్లతో హ్యామ్‌రోడ్లు మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు.

కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్‌కుమార్, డీఈ శ్రీనివాస్, నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, షైబూబ్‌అలీ, నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరి బాలు, గాయం ఉపేందర్‌రెడ్డి, గుండు నరేందర్, శ్రీనివాసరెడ్డి పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రులు మూడు గంటలు ఆలస్యంగా రావడంతో పలు కార్యక్రమాలకు హాజరుకాకుండానే హైదరాబాద్ తిరిగివెళ్లారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

మిర్యాలగూడ నాలుగు లేన్ల రింగురోడ్డు పనులకు రూ.74కోట్లతో శెట్టిపాలెం-అవంతీపురం వద్ద శంకుస్థాపన చేశారు. రూ.15కోట్ల టీఏ ఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టిన రోడ్డు, రూ.16.25కోట్లతో మునిసిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రూ.41కోట్లతో బీటీ, సీసీరోడ్డు పనులు, రూ.15కోట్లతో మిర్యాలగూడ-తడకమళ్ల డబుల్‌రోడ్డును ఆరులేన్లుగా విస్తరించే పనులు, రూ.3కోట్లతో ఫ్లైఓవర్, మునిసిపల్ కార్యాలయం ఏరియా సుందరీకరణ పనులకు మంత్రులు శంకుస్థాపనలు చేశారు. రూ.5కోట్లతో కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో నిర్మించిన అదనపు భవనం, జూనియర్ కళాశాలలో రూ.2.25కోట్లతో నిర్మించిన అదనపు భవనాన్ని మంత్రులు ప్రారంభించారు.

ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటుకు రూ. 25 లక్షలు అందజేత



మంత్రులకు చెక్కును అందజేస్తున్న గౌరు శ్రీనివాస్, కర్నాటి రమేష్

మిర్యాలగూడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలో ఫ్రీజర్ బాక్స్‌ను ఏర్పాటుకు రూ. 25 లక్షలు విరాళంగా అందజేశారు. సోమవారం మి ర్యాలగూడలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు, ప్రారంభోత్సవానికి హాజరైన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, పట్టణ మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ చెక్కును అందజేశారు.

జిన్నింగ్ మిల్లులు బంద్

(5వ పేజీ తరువాయి)

అదే వ్యాపారులు తిరిగి అవే మిల్లులకు విక్రయిస్తే దాన్ని జిన్నింగ్ చేసిన తర్వాత ఆ దూదిని సీసీఐ కొనుగోలు చేయడంలో మతలేబంటని రైతులు వాపోతున్నారు. రైతులపై బాధ్యతగా వ్యవహరించాల్సిన సీసీఐ ఇలా వ్యాపారధోరణితో వ్యవహరించడం అన్యాయమని వాపోతున్నారు. 7క్వింటాళ్ల నిబంధన సడలించి 13 క్వింటాళ్ల వరకు అనుమతించాలని, అదేవిధంగా తేమశాతాన్ని సడలించి 15శాతం వరకైనా కొనుగోళ్ల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అన్ని మిల్లుల్లోనూ పత్తి కొనుగోళ్ల నిర్వహించాలని డిమాండ్ రైతుల నుంచి, జిన్నింగ్ వ్యాపారుల నుంచి వస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

జిల్లాలో ఈసీజన్‌లో 57లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని, అందులో సగంమేరకైనా జిల్లాలో సీసీఐ ద్వారా కొనాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనావేశారు. ఈ మేరకు జిల్లాలోని 23 పత్తి జిన్నింగ్ మిల్లులను సీసీఐ సంసిద్ధం చేసింది. ఆయా మిల్లులతో జిన్నింగ్ నిమిత్తం అగ్రిమెంట్లు చేసుకుంది. అయితే ఎల్-1, ఎల్-2, ఎల్-3 నిబంధనలు అమల్లోకి తేవడం, 7క్వింటాళ్లు, తేమ శాతం నిబంధనలతో సీసీఐ కొనుగోళ్ల పూర్తిగా మందగించాయి. జిల్లాలో సుమారు రెండు నెలల నుంచి కొనుగోళ్ల సాగుతున్నా, ఇప్పటివరకు 15 మిల్లుల్లో 98,480 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలుచేశారు. ఇంకా రైతుల వద్ద పత్తి అలాగే ఉంది. జిల్లాలో తేమశాతం ఎక్కువగా ఉంటే సీసీఐ కొనుగోలు చేయకుంటే రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. క్వింటా రూ.5,500 నుంచి రూ.6,200 లోపు గ్రామాల్లోనే ఇళ్ల వద్ద వ్యాపారులకు విక్రయిస్తున్న పరిస్థితి జిల్లాలో ఉంది.